# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 249 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 30 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 249 30-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరణ 2లో..

# ముంచెత్తిన మొంథా





- ఏపీ తీరాన్ని దాటిన తీవ్ర తుపాను మొంథా, పలు జిల్లాల్లో విధ్వంసం
- గాలుల బీభత్సానికి ఇద్దరు మృతి, భారీగా ఆస్తి, పంట నష్టం
- కోనసీమలో 20 వేల ఎకరాల్లో వరి పంట ధ్వంసమైనట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే, సమీక్ష
- పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆర్థిక సాయం, నిత్యావసరాల పంపిణీ
- సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు



అమరావతి అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొంథా తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసింది. బుధవారం తెల్లవారుజామున రాష్ట్ర తీరాన్ని దాటిన ఈ తుఫాను పెను విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, వేలాది ఇళ్లు, పంటలు, విద్యుత్ టవర్లు దెబ్బతిన్నాయి. తుపాను ధాటికి జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. భారీ గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కుండపోత వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కోస్తా జిల్లాల్లోని అనేక గ్రామాలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపైకి వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి, నేలకొరిగిన చెట్లను, స్తంభాలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాకినాడ, మచిలీపట్నం మధ్య

- తరువాయి 2లో..

# అధైర్యపడొద్దు..అండగా ఉంటాం..



- తుపాను బాధితులకు సీఎం చంద్రబాబు పరామర్శ...
- మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన
- కోనసీమ జిల్లా ఓడలరేవులో బాధితులను పరామర్శించిన ముఖ్యమంత్రి
- ప్రభుత్వ సాయం అందిందని సీఎంకు వివరించిన నిర్వాసితులు
- నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం
- పంట నష్టంపై త్వరగా అంచనా వేసి ఆదుకుంటామని హామీ
- బాపట్ల, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే

అమలాపురం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొంథా తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. క్షేత్రస్థాయిలో బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేశారు.

ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని ఆయన భరోసా ఇచ్చారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముందుగా అల్లవరం మండలం ఓడలరేవులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న తుపాను బాధితులతో నేరుగా మాట్లాడి వారి యోగక్షేమాలను విచారించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.3 వేల తక్షణ ఆర్థిక సాయంతో పాటు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు తమకు అందాయని బాధితులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వారికి ధైర్యం చెప్పారు. ఈ పర్యటన సందర్భంగా చంద్రబాబు

- తరువాయి 2లో..







## మొంథా తుఫాన్ పంట నష్టం వివరాలు

# 5 రోజుల్లో ఇవ్వండి

- 24 గంటల్లోగా పునరావాస శిబిరాల్లో కుటుంబాలకు రేషన్
- విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణే లక్ష్యం
- మెరుగైన పారిశుధ్యంపై దృష్టి పెట్టండి
- తాగునీరు కలుషితం కాకుండా చూడండి... నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- తుఫాన్ మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు పరిహారం
- తుఫాన్ అనంతర పరిస్థితులపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఐదు రోజుల్లోగా పంట నష్టానికి సంబంధించిన పూర్తి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి

- తరువాయి 2లో..





## తుపాను ప్రభావిత గ్రామాల్లో

# సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్

- పకడ్బందీగా పారిశుద్ధ్య పనుల కోసం మొబైల్ బృందాలు
- రోడ్ల పునరుద్ధరణకు తక్షణ చర్యలు
- తాగు నీరు సరఫరాకు ఇబ్బంది ఏర్పడిన చోట్ల ప్రత్యామ్నాయ చర్యలు
- మొంథా తుపాను అనంతర కార్యచరణపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూఎస్. ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్



'మొంథా తుపానును సమర్థంగా ఎదుర్కొన్నాం. ఇప్పుడు తుపాను అనంతర చర్యలు అత్యంత కీలకమైనవి. ఈ సమయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖలు యుద్ధ ప్రాతిపదికన పని చేయాలి. పటిష్టమైన ప్రణాళికతో, సమన్వయంతో పనిచేయాలి. తుపాను, భారీ వర్షాలు తగ్గాక గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. ఎక్కడా ఇబ్బందులు లేకుండా దీనిని సమర్థవంతంగా పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉంద'ని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులకు సూచించారు. తుపాను ప్రభావం తీవ్రంగా ఉన్న గ్రామాల్లో సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్ కార్యక్రమాలను మొదలుపెట్టాలన్నారు. తుపాను ప్రభావం వల్ల పాడైన రోడ్లను

- తరువాయి 2లో..



## మొంథా తుఫాన్ తీవ్రత తగ్గినా

# విద్యుత్, రవాణా ఇబ్బందులు : మంత్రి అచ్చెన్నాయుడు

అమలాపురం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొంథా తుఫాన్ ముందుగా ఊహించినంత తీవ్రత కనబరచకపోయినా, విద్యుత్ సరఫరా మరియు రహదారి రవాణా వ్యవస్థలకు ఇబ్బందులు కలిగించిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన, మార్కెటింగ్, డైరి, రీడెవలప్మెంట్ మరియు మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి తుఫాన్ సహాయక చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుఫాన్ ఈదురుగాలుల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సుమారు 300 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, వాటి పునరుద్ధరణ పనుల్లో 80 శాతం పూర్తి అయ్యిందని, మిగిలిన 20 శాతం పనులు రాబోయే రెండు గంటల్లో పూర్తి చేసి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ఎంఈడీ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు రేయింబవళ్లు కొనసాగుతున్నాయని



పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 54 సబ్‌స్టేషన్లు తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మొదటి ప్రాధాన్యతగా ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాలి అని సూచించారని, ఆ దిశగా వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రామచంద్రపురం, రాజమహేంద్రవరం, ముమ్మిడివరం వంటి ప్రాంతాల నుండి మానవ వనరులను తరలించి విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 134 కిలోమీటర్ల మేర రహదారులపై కూలిన వృక్షాలను తొలగించి రాకపోకలను పూర్తిగా పునరుద్ధరించామని, నేటి నుండి ఆర్టీసీ బస్సులు నూటికి నూరు శాతం రాకపోకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మంగళవారం



# జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# కృత్రిమ మేధ ఒక వరం

కృత్రిమ మేధ అన్నీ రంగాలనూ ఉప్పెనలా తాకుతోంది. సర్వాంతర్యామిగా మారింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాల్లోనూ తనదైన ముద్రను చూపుతోంది. ఈ క్రమంలో విద్యా రంగంలోకి కూడా ఈ సాంకేతికత వచ్చి చేరుతోంది. తాజాగా 'ఎఐ ఫర్ యంగ్ మైండ్స్ -ది ఫ్యూచర్ స్టార్ట్ నౌ' పుస్తకం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందింది. గ్లోబల్ ఎఐ నివేదిక-2023 ప్రకారం ఎఐ నైపుణ్యాల అభివృద్ధిలో భారత్ ప్రథమ స్థానంలో నిలిచింది. అమెరికా, జర్మనీలు తరువాత స్థానాల్లో ఉన్నాయి. 2025 నాటికి భారతదేశ ఎఐ మార్కెట్ విలువ 7.8 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ప్రస్తుతం ఆరోగ్యం, వ్యవసాయం, బ్యాంకింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అనేక రంగాల్లో ఎఐ వినియోగం పెరుగుతున్నప్పటికీ, విద్యా రంగంలో దాని ప్రభావం అత్యంత కీలకమైనదిగా మారుతోంది. విద్యా రంగంలోకి కృత్రిమ మేధను తీసుకొచ్చేందుకు పలు దేశాలు పోటీ పడుతున్నాయి. చైనాలో మూడవ తరగతి నుంచే ఎఐని తప్పనిసరి పాఠ్యాంశంగా ప్రవేశపెట్టింది. మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, స్పీచ్ రికగ్నిషన్ వంటి అంశాలను చిన్న వయసులోనే పరిచయం చేస్తోంది. స్మార్ట్ క్లాస్‌రూమ్స్ కూడా అభివృద్ధి చేసింది. ఇక దక్షిణ కొరియాలో కంప్యూటేషనల్ థింకింగ్, ఎఐ లిటరసీని ప్రాథమిక స్థాయిలోనే సాధారణ పాఠ్యాంశాలలో కలిపింది. సింగపూర్‌లో మాధ్యమిక స్థాయి నుంచే AI Literacy, Code for Fun వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టి విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం కల్పిస్తోంది. అమెరికాలో రాష్ట్రాలవారీగా ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ఎఐ విద్యను అమలు చేస్తోంది. స్టెమ్ ఎడ్యుకేషన్, నైతిక ఎఐ వినియోగంపై ఎక్కువ దృష్టి. ప్రైవేట్ రంగంలో గూగుల్, ఐబిఎం, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.కరోనా తర్వాత డిజిటల్ బోధన పెరిగింది. ఎఐ టూల్స్ (ChatGPT, Gemini, Generative AI) తరగతులలో సాధారణమయ్యాయి. ఇవి సమాచారం అందించినా, విశ్వసనీయతను నిర్ణయించేది మనిషే. ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఒక క్లాసులో 30 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు వ్యక్తిగత శ్రద్ధ చూపడం కష్టం. కానీ కృత్రిమ మేధతో ఈ సవాల్‌కు పరిష్కారం లభిస్తుంది. విద్యపై కృత్రిమ మేధ సానుకూల ప్రభావం చూపుతోందని ఇటీవల ఒక సర్వే వెల్లడించింది. విద్యా రంగంలో సమగ్రత కోసం పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ టర్న్‌టిన్ ఈ సర్వే నిర్వహణకు ప్రోద్బలం అందించగా, ఇంగ్లాండ్‌కు చెందిన మార్కెట్ రిసెర్చ్ సంస్థ వాన్సన్ బోర్న్ సర్వే నిర్వహించింది. - ఆర్థిక నేరగాళ్ల అప్పగింతలో పురోగతి ఇందులో భాగంగా భారత్, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, మెక్సికో, ఐర్లాండ్, అమెరికాలకు చెందిన 3500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థల నిర్వాహకుల అభిప్రాయాలు సేకరించారు. భారత్‌లో నిర్వహించిన సర్వేలో పాల్గొన్న వారిలో 93 శాతం విద్యపై కృత్రిమ మేధ సానుకూల ప్రభావం చూపుతోందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో కృత్రిమ మేధ లభ్యత చాలినంతగా ఉందని సర్వేలో పాల్గొన్నవారు వెల్లడించారు. చదువులో, ఇతరత్రా పనుల్లో కృత్రిమ మేధను ఉపయోగించి ఏ విధంగా ప్రయోజనం పొందవచ్చో తమకు తెలియదని భారత్‌లో సర్వేలో పాల్గొన్న వారిలో 50శాతం మంది పేర్కొన్నారు. 'కృత్రిమ మేధ వల్ల కలుగుతున్న సానుకూల పరిణామాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విద్యాసంస్థల నిర్వాహకులకు అద్భుత అవకాశాన్ని అందిస్తున్నాయి' అని టర్న్‌టిన్ సంస్థ దక్షిణాసియా ప్రాంతీయ డైరెక్టర్ చైతాలి మొయిత్రా అన్నారు. ఎఐ టీచర్‌కు ప్రత్యామ్నాయం కాదు. ఈ సాంకేతికతను సహాయక సాధనంగా వాడితే విద్యను బలోపేతం చేస్తుంది. వార్తాపత్రిక చందా కానీ ప్రత్యామ్నాయంగా తీసుకుంటే మనిషి యంత్రాల బానిసగా మారే ప్రమాదం ఉంది. ఎఐ విద్యను విజయవంతంగా అమలు చేయడానికి, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపొందించాలి. సాంకేతిక సౌకర్యాలను అందరికీ అందుబాటులో ఉంచడం, డేటా గోప్యతను రక్షించడం, గురుశిష్య సంబంధాలను బలోపేతం చేయడం అవసరం. కృత్రిమ మేధస్సు విద్యా రంగానికి అపారమైన సామర్థ్యాన్ని అందిస్తుంది. ఇది అభ్యాసనాన్ని మరింత వ్యక్తిగతీకరించినదిగా, సమర్థవంతమైనదిగా, అందరికీ అందుబాటులో ఉండేలా చేయగలదు. అయితే, ఈ సాంకేతికతను బాధ్యతాయుతంగా, నైతికంగా, సమానత్వ దృక్పథంతో అమలు చేయడం చాలా ముఖ్యం. భవిష్యత్తులో ఎఐ విద్యా వ్యవస్థలో అంతర్భాగంగా మారనుంది. ఉపాధ్యాయుడి పాత్ర 'సమాచారాన్ని అందించే వ్యక్తి' నుండి 'అభ్యాసనకు మార్గనిర్దేశం చేసే ఫెసిలిటేటర్' గా మారుతుంది. కృత్రిమ మేధస్సు విద్యా రంగానికి ఒక శక్తివంతమైన వరం. ఈ సాంకేతికతను సరిగ్గా ఉపయోగించుకుంటే, మనం ఉజ్వలమైన, విజ్ఞానవంతమైన భవిష్యత్ తరాలను నిర్మించగలం.

# ముంచెత్తిన మొంథా..

నర్సాపురం సమీపంలో మొంథా తుపాను తీరాన్ని దాటినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఆ తర్వాత క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా, ఆపై వాయుగుండంగా మారింది. ఇది వాయవ్య దిశగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనించి రాబోయే ఆరు గంటల్లో అల్పపీడనంగా బలహీనపడనుందని అధికారులు వెల్లడించారు.

**జిల్లాల్లో తీవ్ర నష్టం**

ఈ తుపాను కారణంగా కోస్తా జిల్లాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్క కోనసీమ జిల్లాలోనే 20 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని వ్యవసాయ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. బాపట్ల జిల్లాలో ఓ పుణ్యక్షేత్రం వద్ద వరద నీటిలో చిక్కుకున్న 20 మందిని పోలీసులు సురక్షితంగా కాపాడారు. పల్నాడు జిల్లా తిమ్మాపురం వద్ద కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)పైకి వరద నీరు చేరడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కొండచరియలు విరిగిపడటంతో శ్రీశైలం ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. ప్రకాశం జిల్లా వెలిగొండ ప్రాజెక్టులోని రెండు టన్నెళ్లలోకి వరద నీరు చేరడంతో, అక్కడ పనిచేస్తున్న 200 మంది సిబ్బందిని సురక్షితంగా బయటకు తరలించారు. నంద్యాల జిల్లాలో కుందూ నది, మద్దిలేరు, చామ కాల్వ వాగులు పొంగిపొర్లుతున్నాయి.

**ప్రభుత్వ సహాయక చర్యలు, సీఎం పర్యటన**

ముఖ్యమంత్రి చంద్రబాబు కోనసీమ జిల్లాలోని ఉడెలరేవులో పర్యటించి, తుపాను నష్టాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అంతకుముందు మంత్రులు, జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, సహాయక చర్యలపై కీలక సూచనలు చేశారు. గత నాలుగు, ఐదు రోజులుగా సమర్థంగా చర్యలు తీసుకోవడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ప్రభుత్వం బాధితులను ఆదుకునేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. ఒక కుటుంబంలో ముగ్గురి కంటే ఎక్కువ సభ్యులుంటే గరిష్ఠంగా రూ.3,000 అందిస్తారు. మొత్తం 75,000 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. వీరితో పాటు మత్స్యకారుల కుటుంబాలకు 25 కిలోల బియ్యం (చేనేత, మత్స్యకారులకు 50 కిలోలు), కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, చక్కెరను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# అధైర్యపడొద్దు..

# అండగా ఉంటాం..







తన కాన్వాయ్ వాహనం నుంచి దిగి ఓ ఇన్నోవా కారులో బాధితులకు వద్దకు వెళ్లారు. నిరాశ్రయులుగా మారిన వారి వద్దకు వెళ్లేందుకు ఆయన ప్రోటోకాల్ ను కూడా పక్కనపెట్టారు. ఈ పర్యటన అనంతరం... అరగట్లపాలెం, బెండమూరులంక గ్రామాలకు వెళ్లి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. పొలాల్లోకి దిగి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తుపాను కారణంగా జరిగిన నష్టం వివరాలను రైతులు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, వీలైనంత త్వరగా పంట నష్టం అంచనాలను పూర్తి చేసి, బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం సీఎం చంద్రబాబు హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే చేపట్టారు. కోనసీమతో పాటు బాపట్ల, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో తుపాను వల్ల జరిగిన పంట నష్టం తీవ్రతను గగనతలం నుంచి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.



# 5 రోజుల్లో ఇవ్వండి

నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పంట నష్టం వివరాలను త్వరగా సేకరించేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, వాటిని కాపాడేందుకు గల అవకాశాలపై రైతులకు తగు సూచనలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. బుధవారం ఉదయం మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి, పర్యటన అనంతరం సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో... తుఫాన్ వల్ల సంభవించిన నష్టంపైనా, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు సేకరించన సమాచారం వరకు పరిశీలిస్తే... రాష్ట్రంలోని 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో 87 వేల హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని, ఇందులో 59 వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో వరి పంటతో పాటు, ప్రత్తి, మొక్కజొన్న, మినుము వంటి పంటలు నీట మునిగినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 78,796 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. అలాగే 42 పశువులు చనిపోయినట్టు చెప్పారు. అయితే ఇది ప్రాథమికంగా ఉన్న అంచనాలు మాత్రమేనని.. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను చూస్తుంటే... తుఫాన్ ప్రభావం వల్ల జరిగిన నష్టం ఇంకా పెరిగేలా ఉందని అధికారులు వెల్లడించారు.

**యథావిధిగా ఆర్టీసీ సర్వీసులు**

సహాయక చర్యలు ఏ విధంగా కొనసాగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ తక్షణం జరగాలని స్పష్టం చేశారు. బుధవారం రాత్రి కల్లా విద్యుత్ సరఫరా చేయాలని, గురువారం నాటికి రహదారుల గుంతలు మరమ్మతు పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసులు యథావిధి కొనసాగించాలని సూచించారు. ఈ విషయాల్లో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరమ్మతులకు గురైన ఫీడర్లను పునరుద్ధరిస్తున్నామని, కూలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు వివరణ ఇచ్చారు. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను పటిష్ట పరచాలన్నారు. పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని చెప్పారు. జలాశయాల సమర్థ నీటి నిర్వహణకు జిల్లా కలెక్టర్లు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు గురువారం నాటికి బియ్యం, నిత్యావసరాల పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా తాగు నీటి సరఫరాకు ఇబ్బంది రాకూడదని, తాగునీరు కలుషితం అయితే సహించేది లేదని, డయేరియా కేసులు నమోదు కాకుండా రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు బాధ్యత వహించాలన్నారు.

**ప్రకాశం జిల్లాలో మెరుగైన చర్యలు చేపట్టాలి**

ఒంగోలు పట్టణంలో పలు కాలనీలు నీట మునగడంపై ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబుపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ ఇటువంటి పరిస్థితి తలెత్తలేదని, భవిష్యత్‌లో పాలనా వైఫల్యం కనిపించకూడదని ముఖ్యమంత్రి చెప్పారు. తుఫాన్ రక్షణ చర్యలపై పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ప్రతీ జిల్లాలోనూ తుఫాన్ల సమయంలో తలెత్తే పరిస్థితులను అధిగమించేలా ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రోడ్లు, పునరావాస కేంద్రాలు, విద్యుత్-తాగునీటి సరఫరా వంటి విషయాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ప్రజాభిప్రాయం సేకరించి, లోపాలను సరిచేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు ముగ్గురు మృతి చెందారని అధికారులు వెల్లడించగా, మృతుల కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తుఫాన్ తీరం దాటడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తుఫాన్ తీవ్ర స్థాయిలో లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారని, ప్రభుత్వం తీసుకున్న రక్షణ చర్యలపై ప్రజల నుంచి సానుకూల స్పందన, సంతృప్తి వ్యక్తమవుతోందని వెల్లడించారు.

**మొత్తం 1.16 లక్షల మందికి పునరావాసం**

రాష్ట్రంలో 1,209 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో 1.16 లక్షల మందికి మొంథా తుఫాను సమయంలో ఆశ్రయం లభించింది. మొత్తం 249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం చూపింది. రాష్ట్రంలో 380 కి.మీ. పొడవున పంచాయతీరాజ్ రహదారులు, 14 బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతినగా రూ.4.86 కోట్ల నష్టం వాటిల్లింది. 2,294 కి.మీ. పొడవున ఆర్ అండ్ బీ రహదారులు దెబ్బతిని రూ.1,424 కోట్ల నష్టం సంభవించింది. రూరల్ వాటర్ సప్లయ్‌కు సంబంధించి రూ.36 కోట్లు, ఇరిగేషన్ పనుల్లో రూ.16.45 కోట్ల వరకు నష్టం జరిగింది. సురక్షిత ప్రాంతాలకు 3,175 మంది గర్భిణీలను తరలించారు. 2,130 మెడికల్ క్యాంపుల నిర్వహించారు. 297 రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండగా, వాటిని దారి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 380 చెట్లు రహదారులపై విరిగిపడగా, అన్నింటినీ తొలిగించారు. మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్ సహా ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్

ప్రాధాన్య ప్రకారం బాగు చేయాలన్నారు. మొంథా తుపాను అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన చర్యలను తక్షణమే మొదలుపెట్టాలని సూచించారు. 1583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రివర్యులకు తెలియచేశారు. శానిటేషన్ సిబ్బందిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకున్నామని చెప్పారు. 38 చోట్ల రోడ్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయనీ, మరో 125 చోట్ల రహదారులకు గుంతలు ఏర్పడ్డాయని వివరించారు. రక్షిత తాగు నీటి పథకాల ట్యాంకులు దగ్గర క్లోరినేషన్ ప్రక్రియ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "తాగు నీటిని అందించే పథకాలకు, నీటి సరఫరాకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయం చూడాలి. ఈ చర్యలు తక్షణమే తీసుకోవాలి. గ్రామాల్లో మొబైల్ శానిటేషన్ బృందాలను సిద్ధంగా ఉంచాలి. 21,055 మంది పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి పారిశుద్ధ్య మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టండి. వాన నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో నీటిని బయటకు పంపించే చర్యలు తీసుకోవాలి. నీరు ఎక్కడ కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ తరుణంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు పెరుగుతాయి. వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో వ్యాధులు రాకుండా అరికట్టాల్సిన బాధ్యత తీసుకోండి. మూడు, నాలుగు రోజుల పాటు పారిశుద్ధ్య నిర్వహణపై పూర్తిగా దీనిపై దృష్టి సారించండి. మళ్ళీ సాధారణ పరిస్థితి వచ్చే వరకు గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి. దీనిలో ఎక్కడ లోటుపాట్లకు తావు ఉండకూడదు. దెబ్బ తిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలి" అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీ కృష్ణతేజ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి**

తుపాను అనంతరం తన శాఖల వారీగా జరిగిన నష్టం, తీసుకోవాల్సిన చర్యలను ఉన్నతాధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి వివరించగా దీనిపై తగిన సూచనలను ఉప ముఖ్యమంత్రి చేశారు.

పంచాయతీరాజ్ శాఖ

రాష్ట్రంలోని జిల్లా పరిషత్ సీఈవోలు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీపీవోలు, డీఎల్ డీఓలు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ సెక్రటరీలతోపాటు క్షేత్రస్థాయి సిబ్బంది కూడా అందుబాటులో ఉండి పరిస్థితిని చక్కదిద్దాలి.

సమాచార లోపం లేకుండా సమన్వయంతో పనిచేయాలి. అవసరమైతే టెలీ కాన్ఫరెన్స్ ద్వారా నిత్యం ఒకరికి ఒకరు మాట్లాడుకొని సమయానుకూలంగా పనులు పూర్తి చేయాలి. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకొని అధికారులు పనులు సమన్వయం చేసుకోవాలి.

రాష్ట్రవ్యాప్తంగా 1158 మొబైల్ శానిటేషన్ బృందాలు ఏర్పాటు చేసుకొని పారిశుధ్య పనులు మొదలుపెట్టాలి.

తుపాను ప్రభావం వల్ల రాష్ట్రంలో 1583 గ్రామాల్లో దుర్భర పరిస్థితులు ఉన్నట్లు గుర్తించాం. పారిశుద్ధ్యం, ఇతర పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎమర్జెన్సీ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. పంచాయతీల వద్ద అవసరమైనంత బ్లీచింగ్ నిల్వలు ఉన్నాయి. డ్రైనేజీల్లో అడ్డంకులు ఏర్పడితే క్షేత్ర స్థాయి సిబ్బంది తక్షణమే స్పందించాలి.

గ్రామీణ నీటి సరఫరా శాఖ

తుపాను ప్రభావంతో రాష్ట్రంలో మొత్తం మీద గ్రామీణ నీటి సరఫరా శాఖకు చెందిన వివిధ మంచి నీటి పథకాలకు రూ.1.04 కోట్ల నష్టం ఏర్పడింది. వీటిని వెంటనే పునరుద్ధరణకు చర్యలు చేపట్టండి.

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్

మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 779 రోడ్లు, 89 బ్రిడ్జ్ లు, 473 కల్వర్టులు దెబ్బ తిన్నాయి. వీటికి వెంటనే మరమ్మతులు మొదలుపెట్టండి.

రాష్ట్రవ్యాప్తంగా తుపాను ప్రభావంతో బ్లాక్ చేసిన రోడ్లను వెంటనే పునరుద్ధరణకు చర్యలు తక్షణమే చేపట్టండి.

పాక్షికంగా ధ్వంసమైన రోడ్లు, వంతెనలను జిల్లా స్థాయి నిధులతో వెంటనే బాగు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయండి. అలాగే ఎస్.డి.ఆర్.ఎఫ్. ఫండ్స్ ద్వారా మిగిలిన వాటిని కూడా పునర్నిర్మించే ఏర్పాట్లు చేయాలి.

# మొంథా తుఫాన్ తీవ్రత తగ్గినా

## విద్యుత్, రవాణా ఇబ్బందులు : మంత్రి అచ్చెన్నాయుడు

పునరావాస కేంద్రాలలో భోజన వసతి పొందిన వారందరికీ బుధవారం సాయంత్రం వరకు ఆశ్రయం కల్పించి, రాత్రి భోజనం అనంతరం స్వగృహాలకు పంపించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.3,000 ఆర్థిక సహాయాన్ని వెంటనే అందజేయాలని అధికారులు ఆదేశించారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 400 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 10,150 మందికి ఆశ్రయం కల్పించామని, వీరిలో ప్రతి కుటుంబానికి రూ.3,000 చొప్పున, ఒంటరి వ్యక్తులకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు, చేనేత కార్మికులు తుఫాన్ ప్రభావంతో ఐదు రోజులుగా ఉపాధి కోల్పోయినందున వారికి 50 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. బియ్యం పంపిణీని రేషన్ డీలర్ల ద్వారా నేటి నుండే ప్రారంభించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి నిశాంతిని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల వరి పంట తుఫాన్ ప్రభావంతో నష్టపోయిందని, అలాగే ఉద్యాన పంటలైన అరటి తదితర పంటలు కూడా నష్టానికి గురైనట్లు తెలిపారు. ఈ నష్టాలను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పంటల నష్టాలను తగ్గించేందుకు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సహకారంతో చర్యలు తీసుకుంటామని, ఆర్థిక సహాయం పారదర్శకంగా అందజేయాలని సూచించారు. బియ్యం, ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసుకోవాలని ఆదేశించారు. మామిడికుదురు మండలంలో తుఫాన్ సమయంలో మరణించిన మహిళ కుటుంబానికి, పోస్ట్‌మార్టం అనంతరం ఐదు లక్షల రూపాయల పరిహారం స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుఫాన్ సహాయక చర్యల ప్రత్యేక అధికారి వి. విజయరామరాజు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఎంపీ జి. హరీష్ మాధుర్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎమ్మెల్యేలు అయితాపత్తులు ఆనందరావు, నిమ్మకాయల చిన్నరాజప్ప, అమలాపురం చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు (డిఆర్ఓ), కే. మాధవి తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరణ

**అమరావతి అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు బుధవారం నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ జస్టిస్ సుబేందుతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కలకత్తా హైకోర్టు నుండి జస్టిస్ సుభేందు ఎపి హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం,ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్



జనరల్ పార్థసారధి,పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు మరియు హైకోర్టు ఉద్యోగులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎపి జ్యుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను వెంటనే

# ప్రభుత్వం ఆదుకోవాలి

### జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి





**ఆత్రేయపురం , అక్టోబర్ 29 (తెలుగు రాష్ట్రం)**

మోంథా తుఫాను ప్రభావంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్న రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామం మరియు ఆలమూరు మండలం చెముడులంక గ్రామాల్లో తుఫాను కారణంగా నేలకొరిగిన వరి పంటలు, విరిగిన అరటి చెట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, "ఉచ్చిలి గ్రామంలో నాలుగు ఎకరాల్లో సుమారు రెండు ఎకరాల అరటి పంట పూర్తిగా విరిగి నేలమట్టమైంది. మొత్తం మండల పరిధిలో సుమారు 50 శాతం వరకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి," అని డిమాండ్ చేశారు. తుఫాను ప్రభావంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే పంట నష్టపరిహారం ప్రకటించి వారిని భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముందస్తు హెచ్చరికలతో ప్రాణాపాయం తప్పింది



**కొత్తపేట, అక్టోబర్ 29 (తెలుగు రాష్ట్రం)**

మోంథా తుఫాను ప్రభావంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని వానపల్లి గ్రామంలో పెంకుటిల్లు కూలిపోయిన ఘటన చోటుచేసుకుంది. అయితే, ప్రభుత్వం ముందస్తుగా జారీ చేసిన హెచ్చరికల కారణంగా ఆ కుటుంబం ప్రాణాపాయం నుండి బయటపడిందని అధికారులు తెలిపారు. తుఫాను వేగంగా వీచిన గాలులకు ఇంటి పైకప్పు మరియు గోడలు కూలిపోవడంతో ఆ కుటుంబానికి ఆస్తి నష్టం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గ్రామంలోని తుఫాను ప్రభావిత ప్రాంతాలను ఎంపీడీవో, ఎంఆర్వో, ఆర్ఐ మరియు పంచాయతీ సర్పంచ్ పలి భీమారావు ప్రత్యక్షంగా పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, వారికి తగిన నష్టపరిహారం త్వరలో అందజేస్తామని సర్పంచ్ భీమారావు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ, "ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల ప్రజలు అప్రమత్తమై, పెద్ద ప్రమాదం తప్పింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం" అని పేర్కొన్నారు.

## విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలి : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, అక్టోబర్ 29 ( తెలుగు రాష్ట్రం )**

మోంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తుఫాను అనంతరం పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తపేట పట్టణంలోని సమితి రోడ్డులో ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా చెట్టు పడిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో పాటు ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "తుఫాను ప్రభావంతో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి, ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా తక్షణమే మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి," అని అధికారులను ఆదేశించారు. అలాగే, వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాను సమయంలో ప్రజలు చూపిన సహనానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలుపుతూ, "ప్రభుత్వం ప్రజల పక్కన ఉంది, ఎవరూ ఆందోళన చెందవద్దు," అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.









అల్లవరం మండలం, ఓడలరేవు గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న తూఫాను బాధితులను కలిసి వారి యోగక్షేమాలపై వివరాలు తెలుసుకుని, వారికి నిత్య అవసరాలను పంపిణి చేసిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అనంతరం వరద ప్రభావం చేత నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు

**అమలాపురం అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**







# కిమ్స్ హాస్పిటల్‌లో స్ట్రోక్ డే



**అమలాపురం అక్టోబర్ (తెలుగురాష్ట్రం ప్రతినిధి )**

"ప్రపంచ స్ట్రోక్ అవగాహనా దినోత్సవం" కిమ్స్ హాస్పిటల్ లో బుధవారం నిర్వహించారు. మెదడుకి రక్త సరఫరా అకస్మాత్తుగా ఆగిపోవడం లేదా రక్తనాళం పగిలిపోవడం వల్ల కలిగే పరిస్థితినే స్ట్రోక్ లేదా పక్షవాతం అంటా రన్నారు. సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే దీని లక్షణాలు తగ్గి, ఆరోగ్యంగా ఉండగలమని, అవగాహన కొరకు ఈ ప్రపంచ స్ట్రోక్ అవగాహనా దినోత్సవం జరుపుకుంటున్నామని మెడికల్ డైరెక్టర్ డా. హరి కిరణ్ వర్మ అన్నారు. స్ట్రోక్ వచ్చినపుడు ఆలస్యం చేయకుండా వెంటనే హాస్పిటల్ కు తీసుకొని వస్తే తగిన చికిత్స ద్వారా నయం చేయగలమని, ప్రముఖ న్యూరాలజిస్ట్ డా.రామ అభిషేక్ తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొవ్వు గల ఆహారం తినడం, వ్యాయామం లేకపోవడం, మానసిక ఒత్తిడి మొదలైన కారణాల వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశం ఉన్నదని డా. రామ అభిషేక్ తెలిపారు. అకస్మాత్తుగా తలతిరుగుడు లేదా సమతుల్యం కోల్పోవడం, ఒక కన్ను లేదా రెండు కళ్లలో స్పష్టంగా కనిపించకపోవడం, ముఖం ఒకవైపు వంగిపోవడం, చేతి లేదా కాలి బలహీనత, మాట తడబాటు లేదా అర్ధంలేని మాటలు వచ్చుట వంటివి స్ట్రోక్ ముఖ్య లక్షణాలని, అటువంటి పరిస్థితులలో వెంటనే న్యూరాలజిస్ట్ ను సంప్రదించి తగిన వైద్యం పొందినట్లయితే త్వరగా కోలుకొని, ఆరోగ్యవంతులు కాగలరని ఆయన తెలిపారు. ఈ అవగాహనా కార్యక్రమ నిర్వాహకులను కిమ్స్ చైర్మన్ కె.వి.వి.సత్యనారాయణ రాజు , ఎం.డి. శ్రీ రవి కిరణ్ వర్మ , డీన్ డా.ఆనంద్ ఆచార్య , మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.సుబ్బారావు లు అభినందించారు. కిమ్స్ లో న్యూరోలాజి వైద్యసేవలు స్థానిక ప్రజలందరూ వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

## తుఫాన్ సేవల్లో అధికారులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంస

### 5043 మందిని పునరావాస కేంద్రాలకు తరలింపు  ు విద్యుత్ శాఖ సిబ్బంది సేవలు అభినందనీయం

**కొత్తపేట, అక్టోబర్ 29 ( తెలుగు రాష్ట్రం ):**



మొంథా తుఫాన్ గండం గట్టెక్కిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. తుఫాన్ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం సమన్వయంతో సమర్థవంతంగా పని చేయడం వల్లే పెద్ద నష్టం తప్పిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ు "నియోజకవర్గం మొత్తం మీద ముందుగానే అన్ని శాఖలను అలర్ట్ చేశాం. ఐదు వేల నాలపై మూడు మందిని సురక్షిత ప్రాంతాలైన పునరావాస కేంద్రాలకు తరలించాం. పౌర సరఫరాలు, తాగునీరు, భోజన వసతులు సకాలంలో అందించాం," అని వివరించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు ధ్వంసమైన చోట రాత్రి పగలు కష్టపడి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన విద్యుత్ శాఖ అధికారులు, కార్మికులు చేసిన సేవలు అభినందనీయం అన్నారు. ఆర్డీవో పి. శ్రీకర్, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు పంచాయతీ సిబ్బంది తుఫాన్ సమయంలో నిరంతరం విధుల్లో ఉన్నారని ప్రశంసించారు. వదంతులు వ్యాప్తి చెందకుండా ప్రజల్లో అవగాహన కల్పించడంలో స్థానిక మీడియా ప్రతినిధులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. అలాగే కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలిచి సహాయక చర్యల్లో భాగస్వామ్యమయ్యారని కృతజ్ఞతలు తెలిపారు. "ప్రజల ప్రాణాలు రక్షించడం ప్రభుత్వానికి మొదటి బాధ్యత, అందులో మన అధికార యంత్రాంగం విజయం సాధించింది," అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలను పర్యవేక్షించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

### పల్లెపాలెం గ్రామంలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులకు దుప్పట్లు, మందులు పంపిణీ

**కోనసీమ, అక్టోబర్ 29 ( తెలుగు రాష్ట్రం )**

మోంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పునరావాస చర్యలను పరిశీలించడానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన మరియు మార్కెటింగ్ శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఈ రోజు కోనసీమ జిల్లాలోని అంతర్వేది మండలంలోని పల్లెపాలెం గ్రామాన్ని సందర్శించారు. తుఫాన్ సమయంలో గాలివానలు, అధిక వర్షాల ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందని మంత్రి తెలిపారు. పల్లెపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ ఉన్న బాధితులతో మాట్లాడి వారి అవసరాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బాధితులకు దుప్పట్లు, మందులు, అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. తరువాత మంత్రి అచ్చెన్నాయుడు గారు గోదావరి నది సముద్ర సంగమ స్థలమైన అంతర్వేది వద్ద తుఫాన్ ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. గోదావరి ప్రవాహం మరియు సముద్ర అలల పరిస్థితిని తెలుసుకుంటూ, స్థానిక మత్స్యకార కుటుంబాలతో మాట్లాడి వారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత. ఎటువంటి పరిస్థితుల్లోనూ బాధితులు నిరాశ చెందకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.











## తుపాన్ కీ దెబ్బతీన్న ఎలక్టికల్ ట్రాన్సార్మర్...



**అమలాపురం అక్టోబర్ (తెలుగురాష్ట్రం ప్రతినిధి )**

మొంథ్ తుపాన్ సమయంలో బలమైన గాలులుకు అమలాపురం మండలం జనిపల్లి లో నేలకొరిగిన ట్రాన్ఫర్మర్ ను తొలిగిస్తున్న అమలాపురం నియోజకవర్గం ఎస్. సి సెల్ అధ్యక్షులు ఈతకోట నాగేశ్వరావు, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు, యువత పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**అమలాపురం అక్టోబర్ (తెలుగురాష్ట్రం ప్రతినిధి )**

డా.బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం రాజోలు గ్రామం లో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు బుధవారం జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ ప్రజలకు అందిస్తున్న భోజన సదుపాయాలు, వసతి ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షించారు. అదే విధంగా తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రభుత్వం తక్షణ సాయాన్ని అందించాలన్న ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలలో ఎటువంటి జాప్యం లేదా అలసత్వం వహించరాదని ఈ సందర్భంగా అధికారులను సూచించారు. ప్రజల భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతగా ఉండాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు చొల్లంగి త్రినాథ్, కటికి రెడ్డి గంగాధరం, మాకిరెడ్డి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## 31 నుంచి రాజమండ్రి - అమలాపురం ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సమయాలలో స్వల్ప మార్పులు

**అమలాపురం అక్టోబర్ (తెలుగురాష్ట్రం ప్రతినిధి )**

ప్రయాణికుల అభ్యర్ధన మేరకు రాజమండ్రి నుండి. అమలాపురం వచ్చే ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సమయాలను స్వల్పంగా మార్చడం జరిగినది. రాజమండ్రి రైల్వే స్టేషన్ నుండి అమలాపురం వచ్చే ప్రయాణీకుల సౌకర్యార్ధం బస్సుల సమయములను ఈ క్రింది విధంగా మార్పు చేసినట్లు డా. B R.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజారవాణాధికారి S.T.P. రాఘవకుమార్ గారు తెలియజేశారు. రాజమండ్రి నుండి అమలాపురం వైపుకు పాత సమయాలు ఉదయం: 6.15, 6.45, 7.15, 7.45 మార్చిన సమయాలు. ఉదయం: 5.15, 5.45, 6.15, 7.00, 7.30

తెలుగురాష్ట్రం
దినపత్రిక

# ఆశలను అవకాశాలుగా మలుచుకునే సాధనమే ఆధునిక టెక్నాలజీ

## -ఏపీ నిట్ లో ఘనంగా టెడ్ ఎక్స్ కార్యక్రమం

**తాడేపల్లిగూడెం, అక్టోబర్29 (తెలుగురాష్ట్రం విలేకరి):**
ఆశలను అవకాశాలుగా మార్చుకునే సాధనమే ఆధునిక టెక్నాలజీ అని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద గడియారం సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో టెస్సెల్లేట్ అనే నేపథ్యంలో టెడ్ ఎక్స్ కార్యక్రమాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచదేశాలకు ధీటుగా రాణిస్తుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని వివరించారు. ఫ్రీడమ్ విత్ ఏఐ సిఈఓ అవినాష్ మాద మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని తెలిపారు. విద్యార్థులు కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించిన వారు అగ్రస్థానాల్లో నిలదొక్కుకుంటారని చెప్పారు. కోస్ట్ గార్డ్ వెటరన్




ఆతార్ వామా గౌర్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సరికొత్తగా జీవించాలని తెలిపారు. ఎలికో హెల్త్ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వనిత దాట్ల, ఐఐటి మద్రాస్ ఆచార్యులు, పిన్ కాల్ డాట్ కామ్ వ్యవస్థాపకులు డాక్టర్ పట్టాభిరామన్ ఆన్ లైన్ ద్వారా మాట్లాడుతూ దేశాన్ని ప్రగతి పథంలో నిలపాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు అన్ని అంశాలపై అవగాహనను పెంచుకోవాలని తెలిపారు. సవాళ్ళను అధిగమిస్తూ లక్ష్యసాధనకు ముందుకుసాగాలని సూచించారు. నిత్యాన్వేషిగా రోజు ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవడంపై విద్యార్థులు దృష్టిసారిస్తే విజయ శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని వివరించారు. అతిథులను డీన్లు, ఆచార్యులు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కే.హిమ బిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి కో ఆర్డినేటర్ గాను, ఆర్గనైజర్ గా పయ్యావుల కృష్ణప్రియా, కో ఆర్గనైజర్ గా వేదాంత్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ డాక్టర్ జీబి.వీరేశ్ కుమార్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శీనివాసన్, డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**పి. గన్నవరం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):**
మండల పరిధిలోని ఆర్. ఏనుగుపల్లి గ్రామంను చేర్చుకుని ఉన్న గోదావరి నది పాయలో గుర్తు తెలియని ఒక పురుషుడి మృతదేహం బుధవారం లభ్యమైనది. వయస్సు సుమారు 35 నుండి 40 సంవత్సరములు ఉంటుంది. శరీరం మీద నీలం రంగు ప్యాంటు ఊడిపోయి కాళ్ల వద్ద వేలాడుచున్నది. అదే విధంగా కుడి చేతికి ఎరుపు రంగు తాడు కట్టి ఉన్నది. కుడి చేతి మీద ఇంగ్లీష్ లెటర్స్ తో టాటూలు, హీరో చిరంజీవి ఫోటో టాటూ ఉన్నవి. ఎడమ చేతి మీద ఫోటో టాటూ ఉన్నదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పి. గన్నవరం ఎస్ఐ బి. శివకృష్ణ తెలిపారు.

## చింతూరు సబ్ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి

### -జిల్లా అధ్యక్షులు సోడె ముత్తయ్య

**కూనవరం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):**



ప్రస్తుతం ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా ఏర్పాటు చేయడం వలన పోలవరం నిర్వాసిత మండలాలు ఎటపాక, చింతూరు, కూనవరం, విఆర్ పురం ప్రజలకు వారి అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రం పాడేరు వెళ్లడానికి ఎన్నో రకాలైన ఇబ్బందులు పడవలసి వస్తోంది. అక్కడికి చేరుకొని రావాలంటే మూడు రోజులు పడతుంది. ప్రస్తుతం పాడేరు ప్రాంతాలలో చదువుతున్న పిల్లలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. రహదారి గాటీలు, రోడ్లు, బస్సు సౌకర్యాలు అంతగా లేక ఈ ప్రాంతంలోని వారంతా ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుంది. నాటి ప్రభుత్వము నుండి ప్రస్తుత ప్రభుత్వం మన ఇబ్బందులు చూస్తూనే వస్తా ఉంది. కాబట్టి అధికారులారా మీకు చేతులు జోడించి నమస్కరిస్తున్న ఈ బాధలు పడలేమని, రంపచోడవరం కేంద్రంగా కారం తమన్న దొర జిల్లాగా ఏర్పాటు చేస్తారని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు సోడే ముత్తయ్య డిమాండ్ చేశారు.

## చింతలపూడిలో తుఫాను ప్రభావం



**చింతలపూడి, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):**
చింతలపూడి మండలంలో గత మూడు రోజుల నుండి మొంథా తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఈ పరిస్థితిని దీటుగా ఎదుర్కొని ఏ ఒక్క ప్రాణ నష్టం కానీ, ఆస్తి నష్టం కానీ జరగకుండా 24ఐ7 మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు.చింతలపూడి మండలంలో పలు చోట్ల చింతలపూడి మండలం తహసిల్దార్ ప్రమద్వర పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

## శివాలయ స్నాన ఘట్టాల పరిశుభ్రత

### - ఆలయ కమిటీ ఛైర్మన్ బొర్రా ఆదినారాయణ

**వి. ఆర్. పురం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):**



మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో వెలసియున్న శ్రీ సతి పార్వతీ రుద్రకోటేశ్వర స్వామి ఆలయం వద్ద చుట్టుప్రక్కల, కార్తీక మాసాన్ని పురస్కరించుకున స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులు గోదావరి నదిలో స్నానమాచరించుకునేందుకు పరిసరాలు పరిశుభ్రతగా ఉండే విధంగా ఆలయ చైర్మన్ బొర్రా ఆదినారాయణ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. స్నాన ఘట్టాల పరిసరాల పరిశుభ్రతగా ఉండేందుకు వడ్డిగూడెం గ్రామ పరిధిలో ఉన్న స్నాన ఘట్టాలను శు భ్రంగా ఉండేందుకు తగు చర్యలు చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

## చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ డిఈ వరప్రసాద్



**పోలవరం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
పోలవరం మండలంలో వింజరం గోవిందరాజు చెరువును, వెంకటరెడ్డి గూడెం కాలువను పోలవరం ఇరిగేషన్ స్పెషల్ ఎంఐ సబ్ డివిజన్ డిఈ కె.వర ప్రసాద్ పరిశీలించారు. గోవిందరాజు చెరువు రక్షణ గట్టు బలహీనత, వెంకటరెడ్డి గూడెం కాలువ పూడిక పరిస్థితి, ఇతర సమస్యలను ఇరిగేషన్ డిఈ కి వింజరం నీటి సంఘం ప్రెసిడెంట్ పాయం వెంకటసాయి వివరించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో చెరువులోకి అధికంగా నీరు వచ్చి చేరే అవకాశం ఉన్నందున గోవిందరాజు చెరువు బలహీనంగా ఉన్న గట్టు ప్రదేశాలను దృష్టిలో పెట్టుకుని చెరువులోకి వచ్చే అదనపు నీటిని ఒక తూము ద్వారా ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేయాలని నీటి సంఘం ప్రెసిడెంట్ పాయం వెంకట సాయి కి సూచనలు చేయడం జరిగిందని అన్నారు. అదే విధంగా వెంకటరెడ్డి గూడెం కాలువ పూడిక ఉన్న కారణంగా కాలవకు ఆనుకుని ఉన్న పల్లపు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వింజరం నీటి సంఘం ప్రెసిడెంట్ పాయం వెంకట సాయి, సర్పంచ్ కొక్కెర వెంకట లక్ష్మీ, పోలవరం ఇరిగేషన్ సీనియర్ అసిస్టెంట్ ముంతా సుబ్బారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

**టి. నరసాపురం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేఖరి):**




కామవరపుకోట మండలం ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారిలో ఉప్పలపాడు శివాలయం వద్ద వరద నీరు చేరడంతో సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆ ప్రాంతంలో ఉన్న గుడితోపాటు ఇల్లు వరద ముంపుకు గురికాకుండా ఉండేందుకు అధికారులు అప్రమత్తమై వరద నీటి ప్రవాహంతో ముంపుకు గురవుతారని స్థానికులు భయపడ్డారు. అధికారులు దృష్టికి తీసుకువెళ్లగానే వెంటనే స్పందించి వరద నీటిని జెసిబి సహాయంతో తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరద సహాయక చర్యలలో అత్యంత వేగంగా స్పందించిన కామవరపుకోట మండల అధికార యంత్రాంగానికి వీరమల్ల మధు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వీరభద్ర స్వామి వారి ఆలయం వద్ద గుడారాలు వేసుకుని ఉంటున్న వారి విషయంలో కూడా అధికారులు స్పందించి పునరావాస కేంద్రాలకు తరలించటం అధికారుల్లో ఉన్న మానవత్వాన్ని చాటి చెప్తుందని మధు పేర్కొన్నారు.

## తుఫాన్ ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన పట్టిసీమ రేవు

**పోలవరం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**



పంచ క్షేత్రాలలో ఒకటైన పోలవరం మండలం పట్టిసీమ గోదావరి మధ్యలో కొలువైయున్న శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయానికి కార్తీక మాసంలో ప్రతిరోజు వేలాది మంది భక్తులు వెళ్లి పరమేశ్వరుని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించేవారు. ఈ సంవత్సరం తుఫాన్ ప్రభావంతో భక్తుల రక్షణ దృష్ట్యా అధికారులు నదిపై ప్రయాణాలను తాత్కాలికంగా నిలిపివేశారు. దాంతో వేలాదిమంది భక్తులతో నిత్యం కళకళలాడే పట్టిసీమ పెద్దరేవు సోమవారం మంగళవారం నిర్మానుష్యంగా మారింది. ఆలయ పూజారుల చేత స్వామివారికి నిత్య నైవేద్యాలు, పూజలు జరుగుతున్నప్పటికీ పంచ క్షేత్రాలలో ఒకటైనపట్టిసీమ శివ క్షేత్రాన్ని పరమేశ్వరుని కార్తీక మాసంలో వచ్చే మొదటి సోమవారం కళ్ళారా చుసుకునే భాగ్యం, మనసారా బోలా శంకరుని పూజించుకునే అవకాశం కోల్పోయామని భక్తులు అంటున్నారు. త్వరగా తుఫాన్ ప్రభావం తగ్గిలాంచీ ప్రయాణాలు ప్రారంభం కావాలని ఆ పరమేశ్వరుడిని కోరుకుంటున్నారు.

### తుఫాను నిరాశ్రయులకు మాజీ ఎంపీ మార్గాని ఆధ్వర్యంలో

## దుప్పట్లు, రగ్గులు, రొట్టెలు పంపిణీ



**రాజమహేంద్రవరం, అక్టోబరు 29(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
మ్నొంథా తుఫాను ప్రభావం వల్ల నిరాశ్రయలకు, నిరు పేదలకు మాజీ ఎంపీ, వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ సహాయం అందించారు. వైసీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో స్థానిక పుష్కర్ ఘాట్ దగ్గర సుమారు 200 మంది పేద ప్రజలకు దుప్పట్లు, రగులు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైసీపీ సిటీ యూత్ అధ్యక్షుడు బిల్డర్ చిన్న సమక్షంలో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రోక్కం త్రినాథ్, 24 వార్డు వైసీపీ నాయకులు కటకం చిన్న, బోర్రా కనక లింగిశ్వరావు, గౌరి శంకరరావు, సత్తిరాజు, ఉండ్రాజవరపు సూర్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికులు విధి నిర్వహణలో

## జాగ్రత్తలు తీసుకోవాలి

### -కమిషనర్ రాహుల్ మీనా




**రాజమహేంద్రవరం, అక్టోబర్ 29(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
ప్రమాదాలకు, అనారోగ్యానికి గురి కాకుండా పారిశుద్ధ్య సిబ్బంది విధి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. బుధవారం తెల్లవారుజామున వీఎల్ పురం పరిసర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. జోరు వానలోనూ ఇబ్బంది పడకుండా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు. పారిశుద్ధ్య సిబ్బంది భద్రత కోసం అందజేసిన వ్యక్తిగత రక్షణ కిట్ ఉపయోగించడంతో పాటు వర్షంలో రెయిన్ కోట్లను తప్పనిసరిగా ధరించాలన్నారు. రాత్రిపూట పనిచేయు సిబ్బందికి రేడియం అప్రాన్ లు తప్పనిసరి అని తెలియజేశారు. ఇవి సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అలాగే నగరంలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పారిశుద్ధ్య నిర్వహణ మరింత పకడ్బందీగా చేపట్టాలన్నారు. అనంతరం పలుచోట్ల కూలిన చెట్ల వద్ద తొలగింపు చర్యలను పర్యవేక్షించారు. ఈదురుగాలులకు నగరంలో ఎటువంటి సంఘటనలు జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే తుఫాన్ దృష్ట్యా ప్రజలు కూడా రానున్న రెండు, మూడు రోజులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు

**నాయుడుపేట, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**




తిరుపతి జిల్లా నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించే రక్తదాన శిబిరంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సిఐ బాబి పిలుపునిచ్చారు. నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ఉదయం 8:30కు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నాయుడుపేట అర్బన్ సిఐ బాబి తెలియజేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సిఐ బాబి తెలిపారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు నిలబెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సేవే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న పోలీసుల లక్ష్యాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి రక్తదాన శిబిరంలో అర్బన్, రూరల్ ప్రజలు పాల్గొనాలని సిఐ బాబి కోరారు.

### పోలవరం విద్యుత్ శాఖ సిబ్బంది

## పనితీరు భేష్



**పోలవరం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
పోలవరం ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పనితీరుపై గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు. విపత్కర పరిస్థితులలోనూ, ప్రతికూల వాతావరణంలోనూ ప్రజల సమస్యను గుర్తించి తక్షణమే పరిష్కారం చూపి సకాలంలో కరెంటును వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. గ్రామంలో కరెంటుకు సంబంధించి ఎక్కడ ఏ సమస్య ఉన్న సమాచారం తెలిపిన వెంటనే స్పందిస్తూ వీలైనంత త్వరగా పరిస్కరిస్తున్నారని గ్రామస్తులు చెపుతున్నారు. కరెంటు ప్రస్తుత జీవన విధానంలో ఒక భాగమై నిత్యవసరంగా మారిన విషయం తెలిసిందే. ఉదయం నిద్ర లేచిన దగ్గరనుండి మళ్ళీ ఉదయం అయ్యే వరకు 24 గంటలు మనిషి ప్రతి అవసరంలోనూ అత్యంత ప్రాధాన్యత ఉంది. వాటర్ కావాలంటే మోటర్కు కరెంటు, మొబైల్ ఫోన్ పని చేయాలంటే కరంటే, గాలి కావాలంటే ఫ్యానుకు కరెంట్, ప్రస్తుత సమాజంలో వంటకు, వెహికల్ నడిపేందుకు కూడా కరెంటు అవసరం అవుతుంది. టెక్నాలజీ పెరిగిన తర్వాత మనిషికి ప్రభుత్వ కార్యాలయాలలోనూ దాదాపుగా ప్రతి పని కంప్యూటర్, ఆన్లైన్ ద్వారానే జరుగుతున్నాయి. మనిషి జీవనానికి అంతటి అవసరమైన కరెంటు పదినిమిషాలు లేకపోతే కరెంట్ ఆఫీసుకు, ఆ ఏరియా లైన్ మెన్ కు 100 ఫోన్ కాల్స్ వెళుతూ ఉంటాయి. అటువంటి పరిస్థితిని పోలవరం విద్యుత్ శాఖ సిబ్బంది అధిగమిస్తూ కరెంటు ఏ ఏరియాలో పోయింది అనే విషయాన్ని ఎప్పటికప్పుడు వాట్సప్ గ్రూపుల ద్వారా ప్రజలకు సమాచారం తెలియజేస్తు త్వరితగతిన సమస్య పరిష్కరించి వినియోగదారులకు కరెంటును అందుబాటులోకి తీసుకు వస్తున్న విద్యుత్ శాఖ సిబ్బందిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

ఉభయ గోదావరి

https://epaper.teluguraastram.com

అమలాపురం
అక్టోబర్ 30,
గురువారం 2025



# తుపాను బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్29 (తెలుగురాష్ట్రం విలేకరి):** తుఫాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏఎంసి మాజీ వైస్ చైర్మన్, తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ శనగన శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మొందా తుఫాన్ ప్రభావంతో ప్రజలు నీళ్ల లేక ఇబ్బంది పడుతున్న దృష్ట్యా తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డ్ చైర్మెన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆదేశాల మేరకు రాష్ట్ర టీడీపీ నాయకులు గొర్రెలు శ్రీధర్, మాజీ ఎంపీపీ, తెదేపా మండల అధ్యక్షులు పరిమి రవికుమార్ చెరొక వాటర్ ట్యాంక్ ట్రాక్టర్లను పంపించారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, తెదేపా నాయకులు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శనగన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామస్తులెవ్వరు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వైస్ ప్రసిడెంట్ కొప్పినేటి వెంకన్న, పార్టీ నాయకులు సాదుల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ ప్రసిడెంట్ సాదుల కృష్ణ, పార్టీ కార్యదర్శి ములపర్తి నారాయణరావు, పార్టీ వైస్ ప్రసిడెంట్ గనుబోయన వెంకన్న, బీజేపీ నాయకులు తాతకుంట్ల శ్రీనివాస్, నాయకులు చిటికిన వెంకన్న, వద్ది లక్ష్మణరావు, సత్యవాడ హరిబాబు, ఆరుగోల్లు వెంకట్రావు, మెరిపే హేమనేలు, సత్యవాడ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టంకు భరోసా కల్పించిన రవిరామ్ కిరణ్ గోరంట్ల



**రాజమహేంద్రవరం రూరల్, అక్టోబర్ 29(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశానుసారం మొంథా తుఫాన్ ప్రభావంతో వీచిన భారీ గాలుల వల్ల కడియం మండలం ఆవ పొలాల్లో నేలనంటిన వరి పంటను తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ సుమారు 1800 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్న రైతులు అందులో 1000 ఎకరాలు వరి పంట దెబ్బతినడం, ఆరుగాలం పండించిన పంట మరో 20 రోజుల్లో చేతికి వచ్చే సమయంలో కళ్ళముందే నేలనంటడం చాలా దురదృష్టకరమని అన్నారు. నేలనంటిన వరి పంటను పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులందరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పంట నష్టం అంచనా వేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, కడియం మండలం టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, బీజేపీ మండల అధ్యక్షులు బొరుసు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు భోజనాలు ఏర్పాటు



**టీ.నరసాపురం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):** బొర్రంపాలెం గ్రామంలో మొంథా తుఫాన్ వరద భాధితులు కొరకు ప్రభుత్వం పునరావాస కేంద్రలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో, వీఆర్వో, కూటమి నాయకులతో కలిసి పాల్గొని పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు దగ్గరుండి భోజనాలు వడ్డించిన మల్లుకుంట సొసైటీ చైర్మన్ శీలం సాయి వినయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని ఎవరు అధైర్య పడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండబోయిన శ్రీను, గండబోయిన వెంకట్రావు, కంపసాటి రమేష్, శివంగుల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ వెదుళ్ళ వెంకటేశ్వరరావు, గుట్ల రామారావు, గుండె గణపతి, కోటి, భరత్, సుబ్బు, యర్రగోళ్ళ సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామస్తుల సహకారంతో శ్రీహరి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వి. ఆర్. పురం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):** అల్లూరి సీతారామ జిల్లా మండల కేంద్రంలోని వడ్డీగూడెం గ్రామానికి చెందిన ముంజపు శ్రీ హరికి ఇటీవల (దొడ్ల డైరీ) బిపి ఎక్కువగా పెరగడంతో బ్రెయిన్ లో రక్తం గడ్డ కట్టడం వలన హాస్పిటల్ లో చేరడం జరిగిందన్న విషయం ప్రజలకు విదితమే. వైద్యులు ఆపరేషన్ నిమిత్తం 10లక్షల వరకు ఖర్చు అవుతుంది అన్నారు. ఈ విషయం తెలుసుకున్న రాజుపేట కాలనీ వడ్రంగి మేస్త్రి గూటాల శంకర్రావు ఆధ్వర్యంలో కడుపు బాలు , గూటాల సందీప్ కుమార్ గ్రూప్ సభ్యులు అందరూ కలిసి, గ్రామస్తుల సహకారంతో తమవంతు సాయంగా 25000 /- రూపాయలు నగదు గూటాల శంకర్రావు , గూటాల రమేష్ చేతులు మీదుగా బాధితుడు కుటుంబానికి రాజమండ్రి హాస్పిటల్ కి వెళ్లి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీహరి కుటుంబీకులు వారికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిదంగా ఎవరైనా సహృదయంతో ఆర్థిక సహాయం చేయాలనుకుంటే ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరని కోరారు. 7793953305: పట్టి సతీష్ 8179926670: సందీప్ రాజు సెల్ నంబర్లకు పంపించగలరని కోరారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండండి

### -ఇంచార్జి తహసీల్దార్ ఉదయ్ నాయక్



**జీలుగుమిల్లి, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):** మొంథా తుఫాన్ నేపథ్యంలో మండల ప్రజలను అప్రమత్తం చేశామని జీలుగుమిల్లి ఇంచార్జి తహసీల్దార్ ఉదయ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవిన్యూ సిబ్బంది ద్వారా ప్రతి పంచాయతీలో ప్రతి గ్రామంలో ఫోన్ల ద్వారా, టా%శీ% టా%శీ% ద్వారా తుఫాన్ హెచ్చరికలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. మూడు రోజులు కూడా ప్రజలు అందరిని అప్రమత్తం చేయడం జరిగిందని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అలాగే రెవిన్యూ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని, మండలంలో ఎక్కడైనా చెట్లు, కరెంటు స్తంభాలు, ఇల్లు , కూలిపోయిన ఎడల వెంటనే నా నెంబర్ కి 94910 41485 తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మి పురం గ్రామంలో కూలిపోయిన చెట్టును తొలగించడం జరిగిందని మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోగా వాటి స్థానంలో కొత్త స్తంభాలు విద్యుత్ సిబ్బంది సహాయంతో నిలబెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే పాత పోలీస్ స్టేషన్ ఖాళీ స్థలంలో ఉన్న 13 కుటుంబాలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పునరావాసం కల్పించి వారికి ఆహారం సమకూర్చడం జరిగిందని తెలియజేశారు. మండల ప్రత్యేక అధికారి, డిఎల్ పిఓ, పోలీసు సిబ్బంది, విద్యుత్ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మిగతా అన్ని శాఖల సిబ్బంది అందరూ కూడా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలియజేశారు.

# మంత్రి నిమ్మల దృష్టికి విలీన మండలాల సమస్యలు

### -పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి రంజిత్ కుమార్



**కూనవరం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని వెలగపూడి సచివాలయంలో కలిసి మూడు నెలల క్రితం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కాచవరం, పోచవరం పంచాయతీలను 2006 రెవెన్యూ లెక్కల ప్రకారం మెరూన్ గ్రామాలుగా ప్రకటించిన దాని మీద ఆయా పంచాయతీలలో ఉన్న గ్రామాలను 41.15 కాంటూరులో కలపాలని వినతి పత్రం ఇచ్చారు. వాటికి సంబంధించి మంత్రి సూచనల మేరకు రాష్ట్ర పునరావాస కమిషనర్ ని, పోలవరం అడ్మినిస్ట్రేటివ్ అధికారిని కలిసి మంత్రి రామానాయుడు ఇచ్చిన లెటర్స్ అందించి విషయం వారికి చెప్పడం జరిగింది. ఈ గ్రామాలే కాకుండ కూనవరం మండలంలో వెంకటాయపాలెం, కరకగూడెం, చుచిరేవుల గూడెం, దూగుట్ట ఇంకా మరిన్ని గ్రామాలు గోదావరి వరదల సమయంలో ఆయా గ్రామాలలో ప్రజలు పడుతున్న సమస్యల గురించి విపులంగా మంత్రికి వివరించడం జరిగింది. అదేవిధంగా ప్రతి సంవత్సరం వచ్చే గోదావరి, శబరి నదుల వరదల వలన కూనవరం మండలంలో గ్రామాలు అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యలను వివరించడం జరిగింది. వెంటనే మంత్రి స్పందించి ఆయా శాఖల అధికారులకు కూనవరం మండలంలో గ్రామాల పరిస్థితి పై నివేదిక అందించమని ఆదేశించారు. ఈ గ్రామాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టి మీకు తగు న్యాయం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గారపాటి రాంబాబు, తోటకూర వీర్రాజు, బూత్ ఇంచార్జి ఏడుకొండలు, ఆలూరి రవీంద్ర, షేక్ సుభాన్, యువత నాయకులు చిమడబోయిన రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### అధికార యంత్రాంగం ప్రజలను

# కంటికి రెప్పలా చూసుకుంది

### -శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):** ప్రభుత్వ ఆదేశాలను శిరసా వహిస్తూ అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసి లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించటం అభినందనీయమని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. మొంథా తుఫాన్ నేపద్యంలో పట్టణంలోని 6వ వార్డుకు చెందిన సుమారు 20 యానాదుల కుటుంబాలకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. అధికారులు అందిస్తున్న వసతి, భోజన ఏర్పాట్లు గురించి ఆయన బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తుపాన్ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్నారని చెప్పారు. అధికారులు గత 48 గంటలుగా నిద్రాహారాలు మరిచిపోయి విధులను అంకితభావంతో నిర్వహించారని ప్రశంసించారు. ప్రజలు తుఫాన్ నుంచి బయటపడ్డారని, కానీ రైతులు తమ తమ పొలాలను నష్టపోయిన దాఖలాలు అధికంగా ఉన్నాయన్నారు. తుఫానుకు నిరాశ్రయులైన కుటుంబాలను గుర్తించామని వారందరికీ రేషన్ కార్డుల ద్వారా నిత్యవసర సరుకులు అందిస్తామని తెలిపారు. కృష్ణయ్య పాలెం, అలంపురం, రావిపాడు గ్రామాల్లో 1400 ఎకరాలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారని చెప్పారు. పూర్తిస్థాయి నష్టాన్ని గుర్తించిన తరువాత ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎమ్మార్వో సునీల్ కుమార్, వర్తనపల్లి కాశి, చాపల రమేష్, గట్టెం నాని, మద్దాల మణికుమార్, మలపాక చిట్టి, పాలూరి వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీను, ఎర్రంశెట్టి శ్రీను, రామ్, లక్ష్మణ్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, పసల కొండ, ఎన్.వి, నల్లగంచు రాంబాబు, అడ్డగర్ల సూరి, యజ్జాడ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ చర్యలు చేపట్టటం అభినందనీయం

### -భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ బాబ్జి



**తాడేపల్లిగూడెం, ఆక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేకరి):** గూడెం మండలం చిన తాడేపల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) బుధవారం పరిశీలించారు. భోజనం, వసతి సదుపాయాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రక్షణ చర్యలు చేపట్టటం అభినందనీయమని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, తెదేపా మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్. యానాంలో చెట్లు తొలిగింపు....





**ఉప్పలగుప్తం అక్టోబర్ (తెలుగురాష్ట్రం ప్రతినిధి ):** మొంథ్ తుపాన్ తీరం దాటే సమయంలో బలమైన గాలులుకు ఉప్పలగుప్తం మండలం ఎస్. యానాం లో చాలాచోట్లా నేలకొరిగిన చెట్లను తొలిగిస్తున్న పంచాయతీ సిబ్బంది, నీటి సంఘం చైర్మన్ దంగెంటి చిట్టిబాబు , జనసేన యువ నాయకులు సత్తి చిన్న, పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది, కూటమి నాయకులు, యువత పాల్గొన్నారు.



# తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే



**రౌతులపూడి, అక్టోబర్ 29 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రౌతులపూడి మండలంలో తుఫాన్ వలన వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలలో బుధవారం ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ పర్యటించారు. బంగారయ్య పేట, మల్లంపేట గ్రామం వెళ్లే మార్గంలో వైఆర్సి కాలువ బ్రిడ్జిలను పరిశీలించారు. అనంతరం ములగపూడి గ్రామంలో చేదులూరి సత్తిబాబు తాటాకిల్లు పడిపోవడంతో 200 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు ఎమ్మెల్యే సత్యప్రభ బాధితు కుటుంబానికి అందజేశారు. తుఫాన్ ప్రభావం వల్ల ఎక్కడ ఏ విధమైన ప్రాణ నష్టం గాని, ఆస్తి నష్టం కానీ జరగకుండా నిరంతరం అధికారులను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అందువలనే ఎక్కడ ఏ విధమైన ఇబ్బందులు ఎదురు కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. పర్వత సురేష్, మండల పార్టీ అధ్యక్షులు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటం శెట్టి సూర్య భాస్కరరావు, రౌతులపూడి టిడిపి యువ నాయకులు పైల వేణుగోపాల్, బలరాంపురం టిడిపి నాయకులు సోమరౌతు చంద్రమౌళి, మల్లంపేట టిడిపి నాయకులు శ్రీరామ్, రెడ్డి శ్రీను, బంగారు సోమినాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# బోడకొండమ్మ ఘాటీపై మొంథా ఆగ్రహం

## రాళ్లు చెట్లు రహదారి స్వాహా.. ప్రయాణికుల్లో తీవ్ర గందరగోళం!



**చింతపల్లి, అక్టోబర్ (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** మొంథా తుఫాన్ అల్లకల్లోలం కొనసాగుతోంది. మంగళవారం అర్ధరాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలు, గాలులతో



బోడకొండమ్మ ఘాట్ రహదారి ప్రమాదకర వలయంగా మారింది. కొండచరియలు విరిగిపడి అధిక ఎత్తు నుండి చెట్లు, భారీ బండరాళ్లు రోడ్డుపైకి ధాటిగా దూసుకొచ్చి రాకపోకలను పూర్తిగా నిలిపేశాయి. వర్షంలో చిక్కుకున్న వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందుల్లో పడిపోయారు. కొర్రుబయలు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపక్క కాలువలో కారు జారిపడిన ఘటన ప్రయాణికులను ఒణికిస్తోంది. పొగమంచు తీవ్రత పెరగడంతో వాహనాల హెడ్‌లైట్లు కూడా ప్రయోజనం లేకుండా మారి ప్రమాద ఛాయలు మరింత ముదిరాయి. పలు చోట్ల చెట్లు, రాళ్లు రహదారిని పూర్తిగా బ్లాక్ చేయడంతో సహాయక వాహనాల సైతం ప్రవేశం సాధ్యం కాలేదు. అత్యవసర వైద్య సేవలు నిలిచిపోయి అనేక వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. రాత్రంతా వానలో ఇరుక్కుపోయిన ప్రజల ఆందోళనకు అవధులు లేకపోయాయి. సమాచారం అందుకున్న చింతపల్లి సీఐ ఎం. వినోద్ బాబు ఆదేశాల మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం సంఘటన స్థలానికి చేరారు. వాతావరణం సహకరించకపోయినా జెసిబి యంత్రాలతో చెట్లు, రాళ్లను తొలగించి చింతపల్లి%-%నర్సీపట్నం రాకపోకలు పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. కొండపై భాగాల నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు తురబడగడ్డ వంతెనపై ప్రవేశించి ఉగ్రరూపం దాల్చింది. దీంతో చింతపల్లి నర్సీపట్నం వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. తరచూ ఇలాంటివే ప్రమాదాలు జరగడం ప్రజల్లో అసహనాన్ని రగిలిస్తోంది. కేవలం అత్యవసర సమయంలోనే స్పందించకుండా శాశ్వత పరిష్కారం ఎప్పుడు తీసుకువస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఘాట్ మార్గంలో సురక్షితంగా ప్రయాణించేందుకు రక్షణ గోడలు, హెచ్చరిక వ్యవస్థలు అవసరమని నిపుణుల సూచనలు. ప్రజలకు భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా రహదారి శాఖ, పోలీసులు పనిచేస్తున్నామని అధికారులు తెలిపారు. మొంథా ప్రభావం తగ్గేంతవరకు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.





# మొంథా తుఫాన్ ప్రభావం.. బోసిపోయిన చింతపల్లి సంత జనం లేక వ్యాపారులు కుంగుబాటు

**చింతపల్లి, అక్టోబర్ 29 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)** మొంథా తుఫాన్ ప్రభావంతో వరుసగా కురిసిన వర్షాలు బుధవారం నిర్వహించిన చింతపల్లి వారపు సంతను నిర్మానుష్యంగా మార్చాయి. సాధారణంగా గిరిజన ప్రాంత ప్రజల రద్దీతో కిటకిటలాడే ఈ సంతలో ఈసారి వినియోగదారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉదయం నుంచే వర్షం ఆగకపోవడంతో పాటు, రహదారులు బురదమయంగా మారిపోవడంతో ప్రజలు మార్కెట్‌కు రావడాన్ని మానేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి టమాటా, వంకాయ, గోంగూర, నల్లకాడ వంటి నిత్యావసర వ్యవసాయ ఉత్పత్తులు తీసుకొచ్చే గిరిజన రైతులు కూడా రవాణా సౌకర్యం లేక ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కూరగాయలు, ధాన్యాలు, అరణ్యోపజాలు అమ్మే వ్యాపారులు తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నారు. సంతలో కూరగాయలు అమ్మే వ్యాపారులు మాట్లాడుతూ సంత రోజైనప్పుడే కొంత ఆదాయం వస్తుంది. అది కూడా ఈసారి బొంగుబారింది. తెచ్చిన సరుకులు తడవడంతో పాడవుతున్నాయి. ఇప్పుడేం అమ్మినా, ఎవరూ కొనడానికి రావడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సంత చుట్టుపక్కల కాలిబాటలు మురుగు నీటితో నిండిపోవడంతో రాకపోకలు





కష్టమయ్యాయి. బ్లూ షీట్లు, బట్టల సహాయంతో తాత్కాలిక రక్షణ ఏర్పరుచుకున్న వ్యాపారులు నిరాశతో రోజు గడిపారు. కొందరు వినియోగదారులు సంతకు చేరినా, పరిస్థితిని చూసి సరుకులు కొనకుండా వెనుదిరిగినట్లు తెలుస్తోంది. వారపు మార్కెట్‌పై ఆధారపడ్డే గిరిజన కుటుంబాలు ఈ వర్షంతో ఆర్థికంగా బలహీనపడ్డాయి. ఒకరోజు అమ్మకాలే వారంకొరకు ఆసరా అయినా, ఈసారి పూర్తిగా దెబ్బతిన్నాయి. కౌలు రైతులు కూడా పంటలకు తడిసిపోవడం వల్ల నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. సంత ప్రాంగణంలో డ్రైనేజీ సదుపాయాల లేమి, పాడైన అంతర్గత రహదారులు, మురికి నీరు నిల్వ వంటి సమస్యలపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి, శాశ్వత సంత అభివృద్ధి చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరుతున్నారు. వర్షాలు తగ్గి రాకపోకలు సులభతరం అయితేనే వచ్చే వారపు సంత మళ్లీ సందడిగా మారే అవకాశం ఉందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటు వ్యాపారస్తులు అటు గిరిజన రైతులు, ఉద్యోగులు వారపు సంత మార్కెట్ కి తరలి రాకపోవడంతో చింతపల్లి నిర్మానుషంగా మారింది.



# తుఫాను తాకిడి..టిడిపి నేత ఇంటిపై చింత చెట్టు బీభత్సం.

## నష్టం భారీగా బాధితుడికి ప్రభుత్వం అండగా నిలవాలి.




**చింతపల్లి, అక్టోబర్ 29 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** మొంథా తుఫాను ప్రభావం మండల ప్రజలను తీవ్రముగా ఇబ్బందులకు గురిచేస్తోంది. తాజంగి పంచాయతీ వంతమామిడి గ్రామంలో టిడిపి గ్రామ కమిటీ సభ్యుడు బోనంగి బెన్న లింగేశ్వరరావు ఇంటిపై భారీ చింత చెట్టు కూలి పెంకుటిల్లు తీవ్రంగా దెబ్బతిన్నది. వర్షం కారణంగా నేల తడిసి మట్టి మెత్తబడడంతో చెట్టు వేరుతో సహా విరగపడి ఇంటిమీద కూలింది. పైకప్పు పూర్తిగా ధ్వంసమై గదిలో ఉన్న వస్తువులు దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండటం విశేషం. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ఘటనాస్థలిని సందర్శించి నష్టం స్థాయిని పరిశీలించారు. చెట్టు తొలగింపుతో పాటు తాత్కాలిక రక్షణ చర్యలను చేపట్టేందుకు గ్రామస్థులతో చర్చించారు. జరిగిన నష్టాన్ని తక్షణమే ఎన్.డీ.ఆర్.ఎఫ్ నిధుల ద్వారా పరిహారం అందించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. బాధితుడు లింగేశ్వరరావు మాట్లాడుతూ తుపాను కారణంగా ఇల్లు, ఆస్తి భారీగా దెబ్బతిన్నాయి. వెంటనే ప్రభుత్వ సహాయం కావాలి. చిన్న పిల్లలతో ఇక్కడే ఉంటున్నాం. వర్షం మరింత పెరిగితే పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా మండలంలో తీవ్ర వర్షాలు కొనసాగుతుండడంతో పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, పంటలు దెబ్బతినడం వంటి పరాధీనాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం గ్రామ స్థాయిలో నష్టం అంచనా వేసి వెంటనే సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## ట్యాంకర్లతో ఇంటింటికి అందించే తాగునీరు సద్వినియోగం చేసుకోవాలి.

### ఎంపీడీవో సీతామాలక్ష్మి, సర్పంచ్ పుష్పలత.








**చింతపల్లి, అక్టోబర్ 29 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** మొంథా తుఫాన్ ప్రభావంతో చింతపల్లి పట్టణం రెండు రోజులుగా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బోర్లు, పంపింగ్ పరికరాలు పనిచేయక త్రాగునీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. ప్రజల కష్టాలను గమనించిన అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ వ్యూహాలకు శ్రీకారం చుట్టారు. అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో సి.హెచ్. సీతామాలక్ష్మి, సర్పంచ్ దురియా పుష్పలత ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ స్వచ్ఛజలాన్ని సరఫరా చేస్తున్నారు. పైపులైన్ వద్ద ప్రత్యేక జనరేటర్లు ఏర్పాటు చేసి వంట, తాగునీటి అవసరాలకు తగ్గట్టు నిరంతరంగా అందజేస్తున్నారు. విద్యుత్ పునరుద్ధరణ జరుగగానే సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగుతుంది. పట్టణం దాహార్తిని శాశ్వతంగా తీర్చేందుకు బోర్ల విస్తరణ, మోటార్ల మరమ్మతులు వేగవంతం చేస్తున్నాము అని అధికారులు ఆశ్వాసన ఇచ్చారు. వర్షంలో కుండలతో నీటి కోసం ఎదురుచూసిన మహిళలు, వృద్ధులు అందించిన సేవలను అభినందించారు. నీరు జీవం. ఈ అవసరం ప్రతి ఇంటికి చేరేందుకు పర్యవేక్షణను మరింత కఠినంగా కొనసాగిస్తున్నాము అని సర్పంచ్ తెలిపారు. సేవల పరంగా ముందుండిన ముక్కలే వెంకటరావు, జేఈ గడుతూరి స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి, విస్తరణ అధికారి అంబేద్కర్, ఇతర సిబ్బందిని ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రజలకు సూచన తాగునీటిని పొదుపుగా వినియోగిస్తూ, పక్కింటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముక్కలి వెంకటరావు, పంచాయతీ విస్తరణ అధికారి అంబేద్కర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది ఎమ్మెల్యే బండారు సత్యానందరావు







**కొత్తపేట, అక్టోబర్ 29 (తెలుగు రాష్ట్రం)** మోంథా తుఫాను కారణంగా విస్తారంగా పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో, ప్రతి నష్టపోయిన రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆయన కొత్తపేట మండలం రామనూతిమెరక, రావులపాలెం మండలం ఈతకోట, అలమూరు మండలం పెనికేరులు గ్రామాల్లో పర్యటించి, తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పొలాలు, అరటి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “తుఫాను ప్రభావంతో చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. వెంటనే చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాం. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం తప్పింది,” అన్నారు. తుఫాన్ సమయంలో పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న కుటుంబాలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. “వేగంగా వీచిన గాలుల వల్ల విస్తృతంగా వరి పొలాలు నేలకొరిగాయి, అరటి పంట తీవ్రంగా దెబ్బతింది. మరో 15 రోజుల్లో పంట చేతికొచ్చే దశలో ఉండగా తుఫాను రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం వారిని తప్పకుండా ఆదుకుంటుంది,” అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికే నష్టపరిహారం ప్రకటించినట్లు వెల్లడించారు వరి పంటకు ఎకరాకు రూ.8,000 అరటి పంటకు ఎకరాకు రూ.14,000 కూరగాయల పంటలకు ఎకరాకు రూ.10,000 తుఫాను ప్రభావాన్ని తగ్గించేందుకు కృషి చేసిన ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. “ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి దార్శనికత, ముందుచూపు వల్లే పెద్ద నష్టం లేకుండా ప్రజలు బయటపడ్డారు,” అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, తోటల శాఖ అధికారులు, అలాగే ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జి, గనిశెట్టి వీరేష్, కొప్పిశెట్టి ప్రసాద్, యల్లమెల్లి జగన్మోహన్, యర్రంశెట్టి బుజ్జి, కాసా సాగర్, జక్కంపూడి బాలాజీ, చిన్నం శ్రీనివాసరెడ్డి, పెచ్చేటి చిన్నారావు, గొడవర్తి బాబీ, కోన శ్రీనివాస్, గొడవర్తి భాస్కరరావు, వైట్ల రామారావు, శీలం వెంకటరమణ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
అక్టోబర్ 30, గురువారం 2025


# నా జాబితాలో ఆ ఇద్దరివే తొలి రెండు స్థానాలు: మెక్‌గ్రాత్



**భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. ఇప్పటికే వన్డే సిరీస్ ముగియగా.. టీ20 సిరీస్ ఇవాళ్టి నుంచి మొదలు కానుంది. తాజాగా ఆసీస్ మాజీ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ ఓ జాబితాను విడుదల చేశాడు. టీమ్‌ఇండియా జట్టు తరఫున అదరగొట్టిన టాప్ -5 వన్డే బ్యాటర్ల లిస్ట్‌ను పేర్కొన్నాడు. అందులో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌కు స్థానం కల్పించినప్పటికీ.. అతడి కంటే ముందు ప్లేస్‌లను ప్రస్తుత తరం ఆటగాళ్లకే ఇచ్చాడు. విరాట్ కోహ్లి, రోహిత్, సచిన్, ఎంఎస్ ధోనీ, యువరాజ్ సింగ్‌ను టాప్ -5 భారత వన్డే బ్యాటర్లుగా మెక్‌గ్రాత్ అభివర్ణించాడు.**

"ఈ లిస్ట్‌లో నేను రోహిత్ శర్మకు రెండో స్థానం ఇస్తా. వన్డే క్రికెట్‌లో అతడి గణాంకాలు చాలా బాగున్నాయి. ఇందులో మూడు డబుల్ సెంచరీలు చేశాడు. వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు 264 పరుగుల రికార్డు కూడా అతడి పేరిటే ఉంది. ఇప్పటివరకు 276 మ్యాచుల్లో 11వేలకు పైగా పరుగులు చేశాడు. టెస్టులతో పోలిస్తే వన్డేల్లోనే అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించాడు. రోహిత్ క్లాస్ ప్లేయర్. అందుకే అతడికి రెండో స్థానం ఇచ్చా. ఇక ఈ జాబితాలో తొలి ప్లేస్ విరాట్ కోహ్లీని కాదని మరొకరికి ఇవ్వడం చాలా కష్టం. అతడి స్ట్రైక్‌రేట్, సగటు అద్భుతం" అని మెక్‌గ్రాత్ విశ్లేషించాడు.

### ఆసీస్‌పై రోహిత్‌కు అద్భుత రికార్డు

దాదాపు ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన రోహిత్ శర్మ ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో అదరగొట్టాడు. ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఆసీస్ గడ్డపై వన్డేల్లో 1000 పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. వన్డేల్లో ఆసీస్‌పై 2500 పరుగులు చేసిన రెండో బ్యాటర్ కూడా రోహితే.

# షమీకి ఎవరి ధ్రువీకరణ అవసరం లేదు: బెంగాల్ కోచ్



**తన ఫిట్‌నెస్‌పై వచ్చిన అనుమానాలను భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ పటాపంచలు చేశాడు. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు జట్టు ఎంపిక సమయంలో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారమే రేపాయి. షమీ ఫిట్‌నెస్‌పై తమ వద్ద అప్‌డేట్ లేదని అగార్కర్ వ్యాఖ్యానించాడు. షమీ సోషల్ మీడియాలో దీనిపై కాస్త ఘాటుగానే స్పందించాడు. ఇప్పుడు రంజీ ట్రోఫీలో గుజరాత్‌పై బెంగాల్ విజయం సాధించడంలో షమీ కీలకపాత్ర పోషించాడు. ఈ సందర్భంగా బెంగాల్ కోచ్, మాజీ క్రికెటర్ లక్ష్మీరతన్ శుక్లా కీలక వ్యాఖ్యలు చేశాడు. షమీకి ఎవరినుంచి ధ్రువీకరణ అవసరం లేదని.. అతడు మ్యాచ్ విన్నర్ అని అభివర్ణించాడు.**

"షమీకి ఎవరి నుంచి కూడా ప్రత్యేకంగా సర్టిఫికెట్ అవసరం లేదు. అతడికి అతడే ధ్రువీకరించుకోగలడు. అభిమానులు, మీడియా ఎప్పుడూ అతనికి మద్దతుగా ఉంటుంది. ఆ దేవుడే షమీకి అతిపెద్ద సెలక్టర్. దేశవాళీలో అతడి ఆటను అందరూ చూశారు. షమీ ఫిట్‌నెస్ స్థాయి కూడా బాగుంది" అని శుక్లా వ్యాఖ్యానించాడు.

### రంజీ ట్రోఫీలో..

గుజరాత్‌తో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో బెంగాల్ అద్భుత విజయం సాధించింది. భారత సీనియర్ పేసర్ షమీ మాత్రం తనదైన శైలిలో ప్రత్యర్థిపై బౌలింగ్‌తో విరుచుకుపడ్డాడు. అతడి నుంచి ఐదు వికెట్ల ప్రదర్శనా వచ్చింది. ఈ మ్యాచ్‌లో ఏకంగా 8 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటి ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచుల్లోనూ కలిపి 15 వికెట్లు తీసిన అతడు.. ఒకసారి ఫైఫర్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

# ఆసీస్‌తో టీ20 సిరీస్.. మూడు మ్యాచులకు నితీశ్ కుమార్ దూరం



**భారత ఆటగాళ్లకు గాయాల సమస్య మళ్లీ మొదలైంది. ఆస్ట్రేలియాతో చివరి వన్డే సందర్భంగా శ్రేయస్ అయ్యర్ తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు రెండో వన్డే సమయంలోనే తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో వైదొలిగాడు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలోనే నితీశ్ ఉన్నాడు. ఇంకా పూర్తిగా కోలుకోలేదని బీసీసీఐ అప్‌డేట్ ఇచ్చింది. ఇప్పుడు ఐదు టీ20ల సిరీస్‌లోని తొలి మూడు టీ20లకు దూరంగా ఉంటాడని బీసీసీఐ వెల్లడించింది.**

"నితీశ్ కుమార్ తొలి మూడు మ్యాచుల్లో ఆడటంలేదు. ఎడమ తొడ కండరాల నొప్పి నుంచి కోలుకుంటున్నాడు. అడిలైడ్‌లో నితీశ్ గాయంతో ఇబ్బంది పడ్డాడు. మెడ నొప్పితోపాటు ఇతర సమస్యలు ఉన్నాయని వైద్యుల దృష్టికి తీసుకొచ్చాడు. అతడిని నిరంతరం మా మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోంది" అని బీసీసీఐ పోస్టు పెట్టింది.

### మళ్లీ టాస్ ఓడిన భారత్..

టీమ్‌ఇండియాకు టాస్ మరోసారి కలిసిరాలేదు. ఆస్ట్రేలియాతో తొలి టీ20 మ్యాచ్‌లోనూ టాస్‌ను కోల్పోయింది. సూర్యకుమార్ యాదవ్ నాయత్వంలోని భారత్ బరిలోకి దిగింది. మరోవైపు ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ టీ20ల్లో 18 సార్లు టాస్ నెగ్గగా.. తొలుత బౌలింగ్‌నే ఎంచుకోవడం గమనార్హం. ఇప్పుడీ సిరీస్‌లో వన్డే మ్యాచులతో కలుపుకొని మిచెల్ మార్ష్ వరుసగా నాలుగో సారి టాస్‌ను నెగ్గాడు.

# పాత సూర్యను చూస్తాం.. బ్యాట్‌తోనే సమాధానం: అభిషేక్ నాయర్



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్ కోసం భారత్ సిద్ధమైంది. ఇప్పుడు అందరి కళ్లు సూర్యకుమార్ యాదవ్ పైనే. గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి నుంచి పెద్ద ఇన్నింగ్స్ వచ్చిన దాఖలాలు తక్కువే. ఆసియా కప్‌లో ఓ రెండు మ్యాచుల్లో ఫర్వాలేదనిపించినా.. అతడి ఆటతీరు మాత్రం అది కాదు. ఈ క్రమంలో ఆసీస్‌పై తప్పకుండా ఒకనాటి దూకుడుగా ఆడిన సూర్యను చూస్తామని మాజీ కోచ్ అభిషేక్ నాయర్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్‌లో 700కి పైగా పరుగులు చేసినట్లు గుర్తు చేశాడు. "ఇప్పుడు ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ మరింత ఆసక్తికరంగా మారబోతోంది. కొన్నిసార్లు జట్టు విజయాలు వ్యక్తిగత ప్రదర్శనలను కప్పేస్తాయి. ఫలితాల్లో వ్యత్యాసం వచ్చినప్పుడే ప్రశ్నలు వస్తాయి. టీ20ల్లో చాన్నాళ్ల పాటు వరల్డ్ నంబర్‌వన్ బ్యాటర్‌గా ఉన్న భారత కెప్టెన్ సూర్యకుమార్ నుంచి మెరుగైన ప్రదర్శన రాలేదు. తప్పకుండా అతడి ఆటతీరుపై జట్టులో స్క్రూటినీ జరిగి ఉంటుందని అనుకుంటున్నా. అతడి సత్తా ఏంటో మనకు తెలుసు. ఆసీస్ పిచ్ కండీషన్, బౌన్స్ తప్పకుండా సూర్యకుమార్ బ్యాటింగ్ స్టైల్‌కు నప్పుతాయి. మొన్నటివరకూ అతడి పేలవ ప్రదర్శన తాలూకా ప్రభావం ఇకపై ఏమాత్రం ఉండదని అనుకుంటున్నా. గత ఐపీఎల్‌లో అతడు మంచి ఆటతీరు ప్రదర్శించాడనేది మరిచిపోకూడదు" అని అభిషేక్ నాయర్ వ్యాఖ్యానించాడు.

### ఒక్క హాఫ్ సెంచరీ లేదు..

భారత సారథి సూర్యకుమార్ యాదవ్ ఈ ఏడాది ఇప్పటివరకు 12 అంతర్జాతీయ టీ20 మ్యాచులు ఆడాడు. ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. గత ఆసియా కప్‌లో పాక్‌పై చేసిన 47 పరుగులే అత్యధికం. ఫియర్‌లెస్ క్రికెట్ ఆడాలని చెప్పే సూర్య నుంచి సరైన ఇన్నింగ్స్ లేకపోవడం అభిమానులను బాధిస్తోంది. మరోవైపు శుభ్‌మన్ గిల్ రూపంలో సూర్య కెప్టెన్సీకే ముప్పు ఉంది. ఈ క్రమంలో ఆసీస్‌తో జరగబోయే సిరీస్‌లో రాణిస్తే వచ్చే ఏడాది ప్రపంచ కప్ వరకూ సూర్య సారథ్యానికి ఢోకా ఉండదని క్రికెట్ విశ్లేషకుల అంచనా.

# వన్డే ప్రపంచ కప్ 2027.. జట్టులో ఎనిమిదో స్థానం నాదే: శార్దూల్



**మొన్నటి వరకు సీనియర్ పేసర్ మహ్మద్ షమీ భారత సెలక్షన్ కమిటీ తనను పరిగణనలోకి తీసుకుంటుందనే ఆశతో ఉన్నాడు. ఇప్పుడు ఆ జాబితాలోకి మరో ఆటగాడు చేరాడు. తాను వచ్చే వన్డే ప్రపంచకప్‌లో తప్పకుండా ఆడతానని శార్దూల్ ఠాకూర్ వ్యాఖ్యానించాడు. మరీ ముఖ్యంగా ఇప్పుడు యువ ప్లేయర్ హర్షిత్ రాణా పోషిస్తోన్న రోల్ తనదేనని స్పష్టంచేశాడు. ప్రస్తుతం శార్దూల్ రంజీ ట్రోఫీలో ఆడుతున్నాడు.**

### శభాష్.. రుతురాజ్.. ఇది కదా స్పోర్టివ్ స్పిరిట్!

"నిరంతరం మ్యాచులు ఆడుతూ.. మెరుగైన ప్రదర్శన చేయడమే నా పని. మళ్లీ జాతీయ జట్టులోకి రావడమే లక్ష్యం. అందుకోసం ఏం చేయాలనేది నాకు తెలుసు. మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు చేయాలి. అదే జట్టు ఎంపిక సమయంలో నన్ను పరిగణనలోకి తీసుకొనేందుకు ఉపయోగపడుతుంది. ప్రతిఒక్కరూ జాతీయ జట్టుకు ఆడాలని కోరుకుంటారు. ఇందులో నేనేమీ మినహాయింపు కాదు. తప్పకుండా మళ్లీ పునరాగమనం చేస్తా" అని శార్దూల్ తెలిపాడు.

### నా ప్లేస్ అదే..

"దక్షిణాఫ్రికా వేదికగా వన్డే ప్రపంచకప్ జరగనుంది. అక్కడ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లకు అవకాశాలు ఎక్కువ. నేను కూడా అదే స్పాట్‌పై దృష్టిపెట్టా. నా అవసరం ఉందని భారత జట్టు భావించినప్పుడు లేదా నేను సెలక్ట్ అయినప్పుడు అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటా. నా సన్నద్ధత ఎలా ఉంటుందంటే.. రేపే మ్యాచ్ ఆడాలన్నా సరే ఐ యామ్ రెడీ" అని శార్దూల్ తెలిపాడు. ఇటీవలే ముగిసిన ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో హర్షిత్ రాణా ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి భారీ షాట్లే ఆడాడు. రెండో వన్డేలో ఓ మాదిరి స్కోరు చేయడం వెనక హర్షిత్ పాత్ర కూడా ఉంది.

34 ఏళ్ల శార్దూల్ ఠాకూర్ ఇప్పటివరకు కేవలం 47 వన్డేలు, 25 టీ20లు, 13 టెస్టులు మాత్రమే ఆడాడు. చివరిసారిగా 2023 వన్డే ప్రపంచకప్‌లో జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అప్పటినుంచి జాతీయజట్టులో చోటు కోసం శ్రమిస్తూనే ఉన్నాడు. అడపాదడపా టెస్టుల్లోకి వచ్చినా.. అది పెద్దగా ప్రభావం చూపించలేదు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# చిరుతో సినిమా నా కల..

## కానీ ఆ ప్రాజెక్ట్‌లో నేను భాగం కాదు: మాళవిక మోహనన్

- మెగాస్టార్ చిరంజీవి, బాబీ కాంబోలో రానున్న 'మెగా 158'
- హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటిస్తున్నట్లు ఊహాగానాలు
- ఈ వార్తలను ఖండించిన నటి మాళవిక మోహనన్
- సోషల్ మీడియా వేదికగా అధికారిక ప్రకటన
- చిరంజీవితో నటించడం తన కల అంటూ వెల్లడి



మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కాంబినేషన్‌లో రాబోతున్న 'మెగా 158' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నట్లు వస్తున్న వార్తలపై నటి మాళవిక మోహనన్ స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ వదంతులేనని ఆమె తేల్చిచెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. "మెగా 158 చిత్రంలో నేను నటిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో ప్రచారం జరుగుతోంది. ఐకానిక్ స్టార్ చిరంజీవి గారితో ఏదో ఒక రోజు స్క్రీన్ పంచుకోవాలనే కోరిక నాకు బలంగా ఉంది. కానీ, ప్రస్తుతానికి నేను ఆ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. దయచేసి ఆ వదంతులను నమ్మవద్దు" అని మాళవిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె ప్రకటనతో చిరంజీవి సరసన నటించబోయే హీరోయిన్‌పై గత కొద్ది రోజులుగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'మెగా 158'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మాళవిక స్పష్టత ఇవ్వడంతో ఈ చిత్రంలో నటించబోయే అసలు కథానాయిక ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనిపై చిత్ర బృందం త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మెడలో పాముతో ప్రియాంక చోప్రా...

## భర్త ఆసక్తికర వ్యాఖ్యలు



- మెడలో భారీ పాముతో ఫోటోలు షేర్ చేసిన ప్రియాంక చోప్రా
- భర్త నిక్ జొనాస్‌తో కలిసి పాముతో పోజులు
- కొత్త జ్యువెలరీ బాగుంది అంటూ సరదాగా వ్యాఖ్యానించిన నిక్ జోనాస్

అంతర్జాతీయ నటి ప్రియాంక చోప్రా తన సాహసోపేతమైన చర్యలతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు చూసి నెటిజన్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఒక భారీ పామును ఆభరణంలా మెడలో చుట్టుకుని ఆమె దిగిన ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ప్రియాంక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫోటోలు, ఒక వీడియోను పోస్ట్ చేశారు. తెల్లటి టాప్, డెనిమ్ జీన్స్, స్టైలిష్ బ్యాండనాతో ఉన్న ఆమె, మెడలో ఒక పెద్ద పామును వేసుకుని ఎంతో ధైర్యంగా కెమెరాకు పోజులిచ్చారు. ఆమెతో పాటు భర్త, ప్రముఖ సింగర్ నిక్ జొనాస్ కూడా ఉన్నారు. ప్రియాంక పాముతో చాలా సౌకర్యంగా కనిపించినప్పటికీ, నిక్ జొనాస్ ముఖంలో మాత్రం కాస్త భయం, అసౌకర్యం స్పష్టంగా కనిపించాయి. ఈ పోస్ట్‌లోని ఒక వీడియోలో నిక్ జొనాస్.. "బేబ్, నీ కొత్త జ్యువెలరీ చాలా బాగుంది" అని అనగా, ప్రియాంక తనదైన శైలిలో స్పందిస్తూ, "థ్యాంక్స్, ఇదే నా కొత్త సెర్పెంటి (పాము ఆకారంలో ఉండే ఆభరణం)" అని బదులిచ్చారు. ఈ పోస్ట్‌తో పాటు, గతంలో తాను పాములతో దిగిన పాత ఫోటోలను కూడా ఆమె పంచుకున్నారు. అందులో ఒకటి 2011లో వచ్చిన '7 ఖూన్ మాఫ్' సినిమాలోనిది కాగా, మరొక ఫోటోలో నాగుపామును చేతితో పట్టుకుని కనిపించారు. తాను 'ది జంగిల్ బుక్' సినిమాలో 'కా' అనే పాము పాత్రకు వాయిస్ ఓవర్ ఇచ్చిన పోస్టర్‌ను కూడా జత చేశారు. ఈ పోస్ట్‌పై నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటూ, "ది జంగిల్ బుక్‌లో మీ వాయిస్ అద్భుతం" అని కామెంట్ చేయగా, మరికొందరు నిక్ ముఖంలోని భయాన్ని చూసి నవ్వుల ఎమోజీలు పోస్ట్ చేశారు. అయితే, జంతు ప్రేమికుల నుంచి విమర్శలు కూడా వెల్లువెత్తాయి. "వినోదం కోసం జంతువులను వాడటం సరికాదు. వాటికి కూడా ప్రాణం, భావాలు ఉంటాయి. వాటి అనుమతి లేకుండా మనం వాటిని వాడుకోకూడదు. ఈ భూమిని పంచుకుంటున్న తోటి జీవులను గౌరవించడం నేర్చుకోవాలి" అంటూ ఒక యూజర్ తీవ్రంగా స్పందించారు.



# మరోసారి పోలీసులను ఆశ్రయించిన మెగాస్టార్ చిరంజీవి

తెలంగాణ : మెగాస్టార్ చిరంజీవి మరోసారి పోలీసులను ఆశ్రయించారు. తనపై ఎక్స్ (ట్విటర్)లో అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారంటూ దయా చౌదరి అనే వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. ఇటీవల హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఇంకా ఇలాంటి పోస్టులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇటీవల చిరంజీవి డీప్ ఫేక్ ఫోటోలు, వీడియోలపై పోలీసులను ఆశ్రయించిన విషయం విదితమే. ఎఐ సాయంతో కొందరు చిరంజీవి ఫోటోలను మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలు సఅష్టించి, వాటిని పలు వెబ్‌సైట్లలో వైరల్ చేశారు. దీనిపై ఆగ్రహించిన చిరు.. సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే కోర్టును కూడా ఆశ్రయించారు. చిరంజీవి అనుమతి లేకుండా ఆయన పేరు, ఫోటోలు, వాయిస్‌ను ఎవరూ ఉపయోగించకూడదని సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

# రవితేజ లేకపోతే నేను, నా కుటుంబం బతికి ఉండేవాళ్లం కాదు : సంగీత దర్శకుడు




మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తన జీవితంలో రవితేజ చేసిన సహాయాన్ని గుర్తుచేసుకుని వేదికపైనే కన్నీటిపర్యంతమయ్యారు. ఒకానొక దశలో జీవితం ముగించుకుందామని అనుకున్న తనను రవితేజ దేవుడిలా వచ్చి కాపాడారని చెప్పడంతో అక్కడున్న అభిమానులు కూడా కంటతడి పెట్టారు. ఈ సందర్భంగా భీమ్స్ మాట్లాడుతూ, "ఒకప్పుడు నేను పూర్తిగా వెనకబడిపోయాను. ఇంటి అద్దె ఎలా కట్టాలి, పిల్లల్ని ఎలా చదివించాలి, రేపు ఎలా బతకాలి అనే ప్రశ్నలతో చివరి స్థితికి చేరాను. అంతా ముగించేద్దామని నిర్ణయించుకున్న సమయంలో పీపుల్స్ మీడియా నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఆ కాల్ రావడానికి కారణం రవితేజ సార్. ఆయన లేకపోతే ఈరోజు నేను, నా కుటుంబం బతికి ఉండేవాళ్లం కాదు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. "ఆ సమయంలో రవితేజ సార్ నా పాలిట దేవుడిలా వచ్చారు. ఆయన ఇచ్చిన ఒక్క అవకాశం నన్ను తిరిగి బతికించింది. అమ్మా నాన్నా.. ఈరోజు మీ కొడుకు బతికి ఉన్నాడంటే దానికి కారణం రవితేజ సార్," అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. "నా ప్రేమను మాటల్లో కాదు, నా సంగీతంలో చూపిస్తాను. సార్ నాకు దేవుడు. ఆయన సినిమాలు వస్తున్నాయంటే నా పాటలకు ప్రాణం వస్తున్నట్లే" అని భీమ్స్ ఉద్వేగంగా ప్రసంగించారు.



# ఘట్టమనేని వారసులొస్తున్నారు..

ఇండస్ట్రీలో ఒకే కుటుంబం నుంచి ఎక్కువమంది వారసులు అనగానే మెగా లేదంటే నందమూరి ఫ్యామిలీలే గుర్తొస్తాయి. అక్కినేని, దగ్గుబాటి కుటుంబాల నుంచి హీరోలు ఉన్నప్పటికీ వేళ్లపై లెక్కపెట్టేంత మంది ఉన్నారు. త్వరలో ఈ లిస్టులోకి ఘట్టమేనేని కుటుంబం కూడా చేరనుంది. ఎందుకంటే ఒకరిద్దరు కాదు ఏకంగా ఏడుగురు వరకు వారసులు. సూపర్‌స్టార్ కృష్ణ వారసుడిగా రమేష్‌బాబు, మహేష్‌బాబు పరిశ్రమలోకి వచ్చారు. హీరోగా ఒకటి రెండు సినిమాలు చేసినప్పటికీ రమేష్‌బాబు పెద్దగా నిలదొక్కుకోలేకపోయారు. మహేష్‌బాబు మాత్రం స్టార్‌హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం రాజమౌళితో మూవీ చేస్తున్నారు. మహేష్ అక్క మంజుల పలు చిత్రాల్లో సహాయ పాత్రలు చేశారు. మహేష్‌బాబు సోదరి ప్రియదర్శని భర్త సుధీర్ బాబు ప్రస్తుతం హీరోగా సినిమాలు చేస్తున్నారు. గల్లా జయదేవ్ కుమారుడు, మహేష్ బాబు మేనల్లుడు అయిన అశోక్ గల్లా మూడు వరకూ సినిమాలు చేశారు. పెద్దగా గుర్తింపు రాలేదు. మహేష్‌బాబు కుమారుడు గౌతమ్ ప్రస్తుతం అమెరికాలో యాక్టింగ్ శిక్షణలో ఉన్నారు. త్వరలోనే అతడి ఎంట్రీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కుమార్తె సితార ఇప్పటికే తండ్రితో కలిసి పలు యాడ్స్ చేశారు. సినిమాల్లోని పాటల్లోనూ అతిథిగా కనిపించింది. రమేష్‌బాబు కుమారుడు జయకృష్ణ ఇప్పటికే హీరోగా తొలి సినిమా చేసేందుకు సిద్ధమయ్యారు. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ డైరెక్టర్ అజరుభూపతి దర్శకుడు. రమేష్ బాబు కుమార్తె భారతి కూడా నటి అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారని సమాచారం. మంజుల కూడా తన కుమార్తె జాన్వి త్వరలో సినిమాల్లోకి రానుందని చెబుతూ ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు. సుధీర్‌బాబు పెద్ద కుమారుడు చరిత్ మానస్, చిన్న కుమారుడు ఇప్పటికే ఎంట్రీ ఇచ్చేశారు.



# నితిన్ ద్విపాత్రాభినయం!

నితిన్ కొత్త ప్రాజెక్టుపై ఒక వార్త వినిపిస్తోంది. వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న కొత్త చిత్రంలో నితిన్ ద్విపాత్రా భినయం చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమా సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వుండనున్నట్లు వార్తలు వస్తున్నాయి. చిట్టూరి శ్రీనివాస రావు బ్యానర్‌లో ఈ సినిమా రానుంది. త్వరలో ఈ సినిమా వివరాలని చిత్రబృందం ప్రకటించనుంది.

# మహారాణి 4 ట్రైలర్ విడుదల



బాలీవుడ్ నటి హేమా ఖురేషి ప్రధాన పాత్రలో వచ్చిన పొలిటికల్ థ్రిల్లర్ సిరీస్ 'మహారాణి' నాలుగో సీజన్ త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సీజన్ వచ్చేనెల 7 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్‌కు రానుంది. మహారాణి తొలి సీజన్ 2021లో రాగా.. ఆ తర్వాత 2022లో రెండో సీజన్, 2024లో మూడో సీజన్ అభిమానులను అలరించాయి. నాలుగో తరగతి పాసైన ఓ సాధారణ గృహిణి సీఎంగా మారి.. రాజకీయంగా అక్రమా లకు పాల్పడే వ్యక్తులకి ఎలా చెక్ పెట్టిందనే కోణంలో ఈ సిరీస్‌ను రూపొందించారు. ఈ వెబ్ సిరీస్‌లో శ్వేతా బసు ప్రసాద్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: tKelugurastram2016@gmail.com, Phone No. 8074368339